# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

గుంటూరు - గురువారం 3 జూలై 2025 | సంపుటి:9 | సంచిక:187 | పేజీలు:8+4 | వెల: రూ.5

GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA | HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM


## విశాఖలో ప్రారంభమైన సముద్ర విహారనౌక




2

## ఆ మరణాలు కొవిడ్ వ్యాక్సిన్‌ల వల్ల కాదు




ఆకస్మిక మరణాలపై కేంద్రం ప్రకటన

2

## తాడేపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రారంభించిన మంత్రి లోకేశ్



**తాడేపల్లి:** మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. స్థానికులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. మంత్రి లోకేశ్ ఇంటింటికీ తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం తాడేపల్లి మండలం సీతానగరం వద్ద రూ.295 కోట్లతో నూతనంగా నిర్మించనున్న రిటైనింగ్ వాల్ పనులను మంత్రి పరిశీలించారు. రిటైనింగ్ వాల్.. స్థానికుల చిరకాల వాంఛ అని ఆయన చెప్పారు. వరదలు వచ్చినా స్థానికుల ఇళ్లలోకి వరదనీరు రాకుండా ఈ నిర్మాణం చేపడుతున్నట్లు లోకేశ్ తెలిపారు.


## తొలి అడుగు విజయవంతం

ప్రజలకు నచ్చిన సేవ చేస్తున్నాం • ప్రతి పథకం ప్రజల చేంతకే తెస్తున్నాం • మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం, జూలై 02 (మనం న్యూస్):** మచిలీపట్నం 48వ డివిజన్ పరిధిలోని బలరాంపేటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. స్థానికుల నుండి వినతులు స్వీకరించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాల

...మిగతా 2లో




# విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడుపుతున్నాం



### కుటుంబానికి పెద్దకొడుకులా సేవ చేస్తున్నా

- సంక్షేమం డబుల్ అందిస్తున్నాం
- నేరాలు చేస్తారు... నాపై నెపం నెడతారు
- ఇప్పుడున్నది 2014 సీఎం కాదు... 1995 సీఎం
- ఏడాదిలో కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు
- కుప్పంలో విమానాశ్రయం ఏర్పాటు దిశగా అడుగులు
- నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి రూ.50 కోట్లు
- కుప్పం అభివృద్ధికి బ్రహ్మాండమైన ప్రణాళిక
- అభివృద్ధికి, సంక్షేమానికి సైకిలే బెస్ట్
- కుప్పం ప్రజా వేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**శాంతిపురం మండలం, జూలై 2 (మనం న్యూస్):** విధ్వంసమైన రాష్ట్రాన్ని వికాసం వైపు అడుగులు వేయిస్తూ.. సంక్షేమం అభివృద్ధి చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తూ.. ప్రతి కుటుంబానికి పెద్ద కొడుకుగా పని చేస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రెండు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబు వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రూ.1292.74 కోట్ల

...మిగతా 2లో

# విదేశాల్లో వైద్య విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలి

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం • ఢిల్లీ వెళ్లి ఎన్ఎంసితో సమావేశం కానున్న ఎపిఎంసి చైర్మన్, రిజిస్ట్రార్

**విజయవాడ సెంట్రల్, జూలై 02 (మనం న్యూస్):** విజయవాడ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిలో వైద్య విధ్యనభ్యసించి ఉన్నత చదువుల కోసం ఇతర దేశాలు వెళ్లి చదివి వచ్చిన విద్యార్థులకు పర్మినెంట్ డిగ్రీ సర్టిఫికేట్ లు ఇవ్వడంలేదంటూ ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు గత 4 రోజులుగా విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ ఎదుట నిరాహారదీక్ష చేస్తున్న ఘటనపైన ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించి చర్యలకు ఉపక్రమించింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం నాడు ఈ విషయంపై డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సులర్ డాక్టర్ చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ వైద్య సంఘం చైర్మన్



డాక్టర్ శ్రీహరిరావు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్, డిఎంఇ డాక్టర్ నరసింహం ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో పలు అంశాలపై చర్చించారు. పలు విదేశాల్లో వైద్యవిద్యనభ్యసించి శాస్వత రిజిస్ట్రేషన్ కోసం ఎదురు చూస్తున్న వైద్య విద్యార్థుల సమస్యలకు పరిష్కారం చూపాలని యూనివర్శిటీ అధికారులను ఆధేశించారు. తక్షణమే డిల్లీ వెళ్లి

...మిగతా 2లో

# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

ఆషాడ సారెను అమ్మవారికి సమర్పించిన భక్తులు

**విజయవాడ పశ్చిమ, జూలై 02 (మనం న్యూస్):** అమ్మలగన్నయమ్మ, ముగ్గురమ్మల గన్న మూలపుటమ్మ కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి ఆషాఢ సారెను సమర్పించేందుకు ఆలయానికి బుధవారం నాడు వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులతో బెజవాడ ఇంద్రకీలాద్రి కళ కళ లాడింది. ఇంటి ఆడపడుచుకు ఏ విధంగా సారె పెట్టే సమయంలో ఎంత సంభరాలు చేస్తారో అంతకంటే భక్తి శ్రద్దలతో భక్త బృందాలు

...మిగతా 2లో



# విజయవాడ సబ్ జైలు నుంచి వల్లభనేని వంశీ విడుదల



**విజయవాడ సెంట్రల్, జూలై 02 (మనం న్యూస్):** ఎట్టకేలకు చాలా రోజుల ఉత్కంఠ తరువాత గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ విజయవాడ సబ్ జైలు నుండి బుదవారం నాడు విడుదలయ్యారు. సుమారు 137 రోజులు సబ్జైల్లో ఉన్న వంశీ ఫిబ్రవరి 16న హైదరాబాద్లో వంశీ అరెస్ట్ అయ్యారు. మొత్తం 11 కేసుల్లో నిందితుడిగా ఉన్న వంశీ పలుమార్లు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. అయితే నూజివీడు కోర్టు 137 రోజుల తరువాత మద్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే మద్యంతర బెయిల్ రద్దు చేయాలంటూ నాగలక్ష్మి అనే మహిళ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. కానీ సుప్రీం కోర్టు ఆమె పిటిషన్ ను తోసిపుచ్చింది. దీంతో అన్ని కేసుల్లోనూ వంశీకి ఊరట లబించింది.



## పవన్ కల్యాణ్‌పై కేసు.. పీవీఎన్ మాధవ్ కీలక వ్యాఖ్యలు

**విజయవాడ:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, బీజేపీ నేతలపై తమిళనాడు ప్రభుత్వం కేసు పెట్టడంపై ఆంధ్రప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో తమిళనాడు ప్రభుత్వంపై మాధవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్, బీజేపీ నేతలపై తమిళనాడులో కేసు పెట్టడం మురుగన్‌పై దాడిగా భావిస్తామని అన్నారు. రాబోయే తమిళనాడు ఎన్నికల్లో డీఎంకే ఓటమి తథ్యమని తెలిపారు పీవీఎన్ మాధవ్.

దుర్మార్గపు పాలన తమిళనాడులో ఉందని విమర్శించారు. సనాతన ధర్మం నాశనం అయిపోవాలని, వేదాంగాలపైన నీచమైన ఆలోచన కలిగిన ప్రభుత్వం తమిళనాడులో ఉందని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో జాతీయ హిందూ ధార్మిక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు, మాధవ్, గజల్ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు. అన్నామలైకి అండగా పవన్ కల్యాణ్ కూడా రంగంలోకి దిగారని చెప్పుకొచ్చారు. పవన్ కల్యాణ్, అన్నామలైకి తాము అండగా ఉంటామని పీవీఎన్ మాధవ్ ఉద్ఘాటించారు.



## మరో రెండు పథకాలకి గ్రీన్ సిగ్నల్.. ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన

**పశ్చిమగోదావరి:** ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2024 ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో విస్తృతమైన సంక్షేమ అజెండాను ప్రకటించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరో రెండు పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేయనుంది. ఈ మేరకు మంత్రి నిమ్మల రామానాయుడు ఈ రెండు పథకాల గురించి కీలక ప్రకటన చేశారు. మహిళలకు ఉచిత

...మిగతా 2లో

## అమెరికా సరిహద్దుల్లో దొరికిపోయిన 10,382 మంది భారతీయులు


**వాషింగ్టన్, జూలై 2:** అమెరికాలోకి అక్రమంగా ప్రవేశిస్తూ ఈ ఏడాది జనవరి నుంచి మే మధ్యలో 10,382 మంది భారతీయులు దొరికిపోయారు. వీరిలో పెద్దల రక్షణ లేని 30 మంది మైనర్లు కూడా ఉన్నారు. అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన వారిలో కూడా అత్యధికంగా గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారున్నారు. ఈ డేటాను అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ విభాగం



...మిగతా 2లో


మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు.. 9 వేల మందికి నోటీసులు! 6


# ముందుగా.. ట్రంప్ భార్యను దేశం నుంచి బహిష్కరించాలె



### అమెరికా అధ్యక్షుడికి తాకుతున్న తిరుగుబాటు ఉద్యమాల సుర్కు

**వాషింగ్టన్, జూలై 2:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వలసదారుల విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈనేపథ్యంలోనే అమెరికా పౌరులు అయినప్పటికీ కొందరిని బహిష్కరించాలంటూ తాజాగా ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఆన్లైన్ వేదికగా ఆయన కుటుంబాన్ని టార్గెట్ చేస్తూ సంతకాల సేకరణ జరుగుతోంది. అందరికన్నా ముందు ట్రంప్ సతీమణి మెలానియాను బహిష్కరించాలన్న పిటిషన్‌కు అనుకూలంగా వేలాదిమంది సంతకాలు చేస్తున్నారు. ఈ ఆన్‌లైన్ మూవ్ మెంట్ పబ్లిక్ పాలసీ అడ్వకసీ గ్రూప్ ఒకటి ప్రారంభించింది. ''సహజంగా పౌరసత్వం పొంది అమెరికా పౌరులు గా మారిన వారిని ట్రంప్ బహిష్కరించాలని భావిస్తున్నందున.. మెలానియా, ఆమె తల్లిదండ్రులను

...మిగతా 2లో

# హసీనాకు ఆరెళ్ల శిక్ష

ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ తీర్పు



**ఢాకా, జూలై 2:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఆర్నెల్ల జైలు శిక్ష విధించినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఆమెను అరెస్టు చేసిన లేక లొంగిపోయిన రోజు నుంచి ఈ శిక్ష అమలుకానుంది. గత ఏడాది రిజర్వేషన్లకు వ్యతిరేకంగా చోటుచేసుకున్న ఆందోళనకర పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని పదవి కోల్పోయి, దేశం వీడిన

...మిగతా 2లో




## ఆ మరణాలు కోవిడ్ వ్యాక్సిన్‌ల వల్ల కాదు

### ఆకస్మిక మరణాలపై కేంద్రం ప్రకటన

### మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమేనని తేల్చిన ఐసీఎంఆర్, ఎయిమ్స్ పరిశోధనలు

**ఢిల్లీ, జూలై 2:** కరోనా మహమ్మారి తర్వాత దేశంలో ఆకస్మిక మరణాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా 40 ఏళ్ల లోపు వారు కూడా గుండె పోటుతో ప్రాణాలు కోల్పోతుండటం కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో ఐసీఎంఆర్, ఎయిమ్స్ వంటి సంస్థలు దీనిపై పరిశోధనలు చేపట్టి కీలక విషయాలు వెల్లడించాయి. ఈ మరణాలకు, కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని తమ అధ్యయనాల్లో తేలినట్లు స్పష్టం చేశాయి. మునుపటి అనారోగ్య సమస్యల ప్రభావమే ఆయా వ్యక్తుల మరణాల్లో కీలక అంశమని పేర్కొన్నాయి. ఈమేరకు అధ్యయనాల నివేదికలను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా ప్రకటించింది. 18-45 ఏళ్ల వయసు వారిలో ఆకస్మిక మరణాలు సంభవించడంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్), నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్సీడీసీ), ఎయిమ్స్ పరిశోధనలు చేశాయి. 2023 మే-ఆగస్టు మధ్య 19 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పలు ఆసుపత్రుల్లో సర్వే చేశాయి. ఆరోగ్యంగా కన్పించినప్పటికీ 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య ఉన్నట్టుండి మరణించిన వారి డేటాను పరిశీలించాయి. వీటిని అధ్యయనం చేసిన తర్వాత.. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ వ్యాక్సిన్లతో ఎలాంటి సంబంధం లేదని గుర్తించినట్లు ఆయా సంస్థలు వెల్లడించాయి. భారత్ లో కొవిడ్ వ్యాక్సిన్లు సురక్షితం, సమర్థవంతమైనవి. వీటివల్ల దుష్ప్రభావాలు చాలా అరుదైన సందర్భాల్లో మాత్రమే కన్పించాయి. గుండె సంబంధిత ఆకస్మిక మరణాలకు అనేక కారణాలు ఉన్నాయి. జన్యుపరమైన సమస్యలు, జీవన శైలి, మునపటి అనారోగ్యాలు.. ఇలా ఏవైనా కావొచ్చు'' అని అధ్యయనాల్లో తెలిపాయి. ఈ ఆకస్మిక మరణాలకు కొవిడ్ టీకాలే కారణమంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని, తప్పుదోవ పట్టించేవేనని పునరుద్ఘాటించాయి. ఆధారాల్లేకుండా చేసే ఇలాంటి ప్రచారాలు వ్యాక్సిన్లపై విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తంచేశాయి. కొవిడ్ మహమ్మారి సమయంలో ఈ టీకాల వల్లే ఎంతోమంది ప్రాణాలు నిలిచాయని ఆ సంస్థలు ప్రకటించాయి.

# విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడుపుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

విలువైన అభివృద్ధి, సంక్షేమ, ప్రత్యేక పథకాల ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే కుప్పంలో రూ.1271.65 కోట్ల పెట్టుబడులు పెట్టే వివిధ కంపెనీలతో ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ సందర్భంగా కుప్పం నియోజకవర్గం శాంతిపురం మండలం, తుంసీ ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. కుప్పం ప్రజలతోనూ.. అలాగే వివిధ పథకాల లబ్దిదారులను ఉద్దేశించి చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా కుప్పం అభివృద్ధి ప్రణాళికలను వివరించడంతోపాటు... రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చెప్పారు. ఇదే సందర్భంలో అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ... రాజకీయాలను నేరమయం చేసే కొన్ని పార్టీల కుట్రలను సీఎం వివరించారు.

### కుప్పంలోని చివరి ఎకరానికీ హంద్రీ-నీవా నీళ్లు

కుప్పం అభివృద్ధికి బ్రహ్మాండమైన ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. నియోజకవర్గాన్ని సర్వతోముఖాభివృద్ధి సాధించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సీఎం వెల్లడించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మీ ముందుకు వచ్చా. దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా కుప్పాన్ని తయారు చేస్తాం. రూ.3,890 కోట్ల వ్యయం చేసి హంద్రినీవా పనులు పూర్తి చేస్తున్నాం. కుప్పంలో ఇప్పటికే హంద్రీ-నీవా కాల్వల లైనింగ్ పనులు జరుగుతున్నాయి. కుప్పం నియోజకవర్గంలో రూ.42.07 కోట్లతో 30.14 కిలో మీటర్ల మేర హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వ పనులు పూర్తయ్యాయి. కుప్పంలో చివరి ఆయకట్టు వరకూ నీళ్లు తీసుకువస్తాం. ఈ ఏడాదిలోనే కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీళ్లు పారిస్తాం. అభివృద్ధి చేసే వారికి మాత్రమే సంక్షేమం గురించి మాట్లాడే హక్కు ఉంటుంది. అప్పు చేసి సంక్షేమం చేస్తామనటం ఏం పరిపాలన..? అప్పు తెచ్చి అభివృద్ధి చేసి వచ్చిన ఆదాయాన్ని సంక్షేమానికి ఖర్చు చేయటమే నిజమైన ఆర్థిక వ్యవస్థ. గత ఏడాదిగా రాష్ట్రంలో ఈ విధానాన్నే అవలంబిస్తున్నాం. ప్రజలంతా ఆశీర్వదించబట్టే ఏడాదిగా సుపరిపాలనను రాష్ట్రంలో అందిస్తున్నాం. కుప్పంలో రూ.1292 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనుల్ని చేస్తున్నాం. ఇప్పటికే రూ.125 కోట్ల విలువైన పనులు కూడా పూర్తి అయ్యాయి. రాష్ట్రంలో గుంతలు లేని రహదారులే లక్ష్యంగా పనిచేసాం. గతంలో మహిళలు కట్టెల పొయ్యిపై వంట చేయకూడదని దీపం పథకం అమలు చేశాం. నాడు దీపంతో గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం.. నేడు దీపం-2.0తో ఉచిత సిలెండర్లు ఇస్తున్నాం. స్వర్ణ కుప్పం ప్రాజెక్టులో భాగంగా రహదారులను సీసీ, బీటీ రోడ్లుగా మారుస్తున్నాం. కుప్పం నియోజకవర్గంలో ప్రతీ ఇంటిలోనూ వంటగ్యాస్ ఉంది. అని చంద్రబాబు వెల్లడించారు.

### బ్రాండ్ కుప్పం

గతంలో బ్రాండ్ కుప్పం అనేది లేదు. ఇప్పుడు బ్రాండ్ కుప్పం పేరుతో ప్రమోట్ చేస్తాం. ఈ బ్రాండును మార్కెట్టులో ఎస్టాబ్లిష్ చేస్తాం. కుప్పంలో తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తాం. కుప్పంలో ఎయిర్ పోర్టు రాబోతోంది. రూ.850 కోట్లను కుప్పం విమానాశ్రయానికి ఖర్చు చేయబోతున్నాం. విమానాశ్రయానికి భూములివ్వొద్దని కొందరు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తారు. ఎయిర్ పోర్టుకు భూమి ఇచ్చిన వారికి మెరుగైన ప్యాకేజీ ఇస్తాం. అమరావతి రాజధానికి భూములిచ్చారు.. రాజధాని రైతులకూ ప్యాకేజీ ఇచ్చాం. కుప్పంలో ప్రతి ఇంటిపైనా సోలార్ ప్యానెల్ ఉండాలి. ప్రతి ఒక్కరూ సోలార్ ప్యానెల్ పెట్టుకునేంత వరకు నేను మీ వెంట పడతాను. ఇళ్లపై రూఫ్ టాప్ ఏర్పాటు ద్వారా మనమే సొంతగా విద్యుత్ తయారు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగానే పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తున్నాం. బీసీలకు రాయితీ కింద సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేస్తాం. సూర్యఘర్ పథకాన్ని పూర్తిగా వినియుగించుకుంటే కరెంటు కోతల పరిస్థితి ఉండదు.. కరెంటు ఛార్జీలు కట్టే పరిస్థితి ఉండదు. కుప్పంలో ఏసీల అవసరం ఉండదు కానీ.. అవసరమైతే ఏసీలకు సోలార్




విద్యుత్ పెట్టుకోవచ్చు. ఇళ్లకే కాదు వ్యవసాయానికి సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలి. వ్యవసాయ మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగించుకోవచ్చు.. కేంద్ర ప్రభుత్వ పథకం కింద మోటార్లకు సోలార్ ప్యానెళ్లు బిగిస్తాం. కుప్పం రైల్వే స్టేషన్ ఆధునీకరిస్తాం, చెన్నైకి, బెంగళూరుకు వెళ్లే వారికి మరింత సౌకర్యంగా ఉంటుంది. పలమనేరు నుంచి కృష్ణగిరి రహదారికి 4 లేన్ల రహదారి వేస్తున్నాం. కుప్పం నుంచి హోసూర్ వరకూ మరో సమాంతర రహదారి నిర్మిస్తాం. కృష్ణగిరి, బెంగళూరు, కోలార్, చెన్నైల మధ్య కుప్పం కేంద్రంగా మారుతుంది. బ్రహ్మాండమైన అభివృద్ధి కుప్పంలో జరగబోతోంది. కుప్పం రూపురేఖలు మార్చేందుకు ఓ అద్భుతమైన ప్రణాళిక తయారు చేశాం. అని చంద్రబాబు వివరించారు.

### ఆరోగ్యం, ఆదాయం, అభివృద్ధి

కుప్పం ప్రజల ఆరోగ్యం బాగుండాలి. ఆదాయం పెరగాలి. అభివృద్ధి చెందాలి. ఈ దిశగానే స్వర్ణ కుప్పం-2029 విజన్ సిద్ధం చేశాం. అన్ని రంగాల్లోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి.. దేశానికే కుప్పం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా. కుప్పంలో ఆలయాల అభివృద్ధి కోసం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేశాం. నియోజకవర్గంలో అన్ని ఆలయాలను పునరుద్ధరించేందుకు ప్రణాళిక చేస్తున్నాం. గోకులం షెడ్లు కూడా పెద్ద ఎత్తున కట్టించాం. నియోజకవర్గంలోని ప్రతీ ఇంటికీ ఆవులను ఇచ్చాం. అదే ఇప్పుడు ప్రతి ఇంటికీ ఆదాయాన్ని సమకూరుస్తోంది. వచ్చే రోజుల్లో కుప్పంలో 10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అవుతుంది. నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం బాగుండాలి. 130 ఇ-ఆటోలతో చెత్త సేకరణ చేస్తున్నాం. ఎలక్ట్రిక్ ఆటోలతో తడి చెత్త, పొడి చెత్త సేకరిస్తున్న తొలి నియోజకవర్గంగా కుప్పం మారింది. పర్యాటక కేంద్రంగానూ కుప్పాన్ని తీర్చిదిద్దేలా కార్యాచరణ చేస్తున్నాం. హార్టీ కల్చర్ హబ్ రాయలసీమ అయితే దానికి దిక్సూచిగా కుప్పం మారుతుంది. వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని కుప్పం యువతకు ఉపాధి కల్పిస్తున్నాం. బిల్ గేట్స్ ఫౌండేషన్ - టాటాతో కలిసి డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేస్తున్నాం. పైలట్ ప్రాజెక్టుగా కుప్పం నుంచే దీన్ని అమలు చేస్తున్నాం. కుప్పం నియోజకవర్గం కోసం జన నాయకుడు పోర్టల్ ద్వారా నియోజకవర్గంలో సమస్యలు, అర్జీలకు పరిష్కారం చేస్తున్నాం. 10,393 మంది బంగారు కుటుంబాలు కుప్పంలో ఉన్నాయి. వీరందరికీ మార్గదర్శులను అనుసంధానం చేస్తాం. అని కుప్పం అభివృద్ధి ప్రణాళికలను సీఎం వివరించారు.

### పేదల కోసం అభివృద్ధి యజ్ఞం

సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా చేస్తున్నాం. వచ్చిన ఆదాయం పేదవారికి కేటాయించాలి, అదే సమయంలో అభివృద్ధి కూడా చేయాలి. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విధ్వంసాన్ని తలచుకుంటేనే భయం వేస్తోంది. రూ.10 లక్షల కోట్ల అప్పులు, అసలూ, వడ్డీలు కలిపి కట్టాలి. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలూ పడకేసేలా గత ప్రభుత్వం వ్యవహరించింది. కేంద్రం ఇచ్చిన డబ్బుల్ని కూడా వేరే వాటికి ఖర్చు పెట్టేసి వివిధ పథకాలను అస్తవ్యస్థం చేసింది. ప్రజల్ని కష్టపెట్టకూడదన్న లక్ష్యంతోనే సంక్షేమ కార్యక్రమాల్ని కొనసాగిస్తున్నాం. కొవ్వూరు నియోజకవర్గంలో ఓ చర్మకారుడ్ని పలకరించి, డప్పు కళాకారులకిచ్చే పెన్షన్ ఇచ్చాను.. ఇది నాకు చాలా ఆనందాన్ని కలిగించింది. ఏ రాష్ట్రమూ ఏపీ ఇస్తున్నంత పెన్షన్ను ఇవ్వడం లేదు. కుప్పం పక్కనే తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు ఉన్నాయి.. అక్కడా ఇలా పెన్షన్లు ఇవ్వడం లేదు. దివ్యాంగులకు 12 రెట్ల మేర పెంచి పెన్షన్ ఇస్తున్నాం. కిడ్నీ లాంటి వ్యాధిగ్రస్తులకు కూడా ప్రభుత్వం సాయం చేస్తోంది. మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేలు ఇస్తున్నాం. మీ ఇంటికి పెద్దకొడుకు తరహాలో సేవచేస్తున్నా. కష్టాల్లో ఉన్న ప్రజల్ని ఆదుకోవటం కూటమి ప్రభుత్వ బాధ్యత. ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం పథకం అమలు చేశాం. ఐదుగురు పిల్లలు ఉంటే ఒకేసారి రూ.75 వేలు చెల్లించాం. భవిష్యత్తులో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తూనే ఉంటాం. రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు చెల్లిస్తాం. గత ప్రభుత్వం రూ.7500 మాత్రమే ఇచ్చింది. గత ప్రభుత్వానికంటే.. డబుల్ సంక్షేమం చేస్తున్నాం. దీపం కింద గ్యాస్ పథకం, పెంచిన పెన్షన్ల కింద పేద, మధ్య తరగతి వారిని ఆదుకుంటున్నాం. ఏ నాయకుడు ప్రజలకు అండగా నిలుస్తారు, జీవితాల్లో వెలుగులు నింపుతారో వారినే ఆదరించాలి. 3775 పెన్షన్లు కుప్పంలో అదనంగా ఇస్తున్నాం. రాష్ట్రంలో అర్హులందరికీ పెన్షన్లు ఇవ్వాలని నిర్ణయించాం. వాట్సప్ గవర్నెన్సు ద్వారా పౌర సేవలు అందుతున్నాయి. ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లకుండానే పౌరసేవలు అందేలా వాట్సప్ గవర్నెన్సును రూపొందించాం. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా సమస్య పరిష్కారం లభించేలా కార్యాచరణ చేపడుతున్నాం. ఆగస్టు 15లోగా 15 లక్షల బంగారు కుటుంబాలకు లక్షల మంది మార్గదర్శకులను సిద్దం చేస్తాం. 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రాన్ని తయారు చేస్తాం. అని చంద్రబాబు చెప్పారు.

### సైకిల్ ఈజ్ ది బెస్ట్

కుప్పంలో 400 మంది డ్వాక్రా మహిళలకు ఇ-సైకిళ్లను అందిస్తున్నాం. ఎక్కువ శ్రమ లేకుండా సైకిల్ తొక్కవచ్చు.. వ్యాయామం కోసం కూడా సైకిల్ తొక్కాలి. అందుకే సైకిల్ ఈజ్ ది బెస్ట్, సైకిల్ తొక్కితే ఆరోగ్యం, ఆనందం, సైకిలే శాశ్వతం. గత ప్రభుత్వ హయాంలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. 22ఏ భూముల్ని ఇష్టానుసారంగా అమ్మేశారు. రాష్ట్రంలో భూ వివాదాలు లేకుండా, ఆక్రమణలు లేకుండా కాపాడే బాధ్యతను కూటమి ప్రభుత్వం తీసుకుంది. గతంలో క్వార్టర్ బాటిల్ తాగి నానా యాగీ చేశారు. అఘాయిత్యాలు చేశారు. రౌడీయిజం చేస్తే ఆటలు సాగనివ్వను. ప్రస్తుతం ఉన్నది సీబీఎన్-2014 కాదు.. సీబీఎన్-1995. 9 సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నాపై ఎప్పుడైనా నేరారోపణలు ఉన్నాయా..? ఇప్పుడు కొందరు రాజకీయాలను నేరమయం చేస్తున్నారు. బాబాయిని చంపి.. నాపై నేరం మోపారు. కారు కింద వారి కార్యకర్తల్నే తొక్కించి.. కుక్కపిల్లలా రోడ్డు పక్కన పడేశారు. ఇప్పుడు వారి కార్యకర్త మరణానికి కారణం ప్రభుత్వమేనంటున్నారు. కోడికత్తి, గులకరాయి లాంటి డ్రామాలాడి నాపైనే నెపం పెట్టారు. హత్యా రాజకీయాలు, శవ రాజకీయాలు చేయను.. నాకు తెలిసింది ప్రజాహిత రాజకీయాలు మాత్రమే. రాక్షసులపై యుద్ధం చేస్తున్నా.. అభివృద్ధి, సంక్షేమ కోసం యజ్ఞం చేస్తున్నా.. యజ్ఞ ఫలితాలను ప్రజలకు అందిస్తాను. తప్పు చేసే వ్యక్తుల్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదు. కులాలు మతాలు కాదు కావాల్సింది అభివృద్దే. తద్వారా నియోజకవర్గం అభివృద్ధి జరగాలన్నదే నా ఆకాంక్ష. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించాలి.. అందుకే నెల రోజుల పాటు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని చేపడుతున్నాం. పార్టీ అధ్యక్షుడిగా పార్టీలో కార్యకర్తలను, సీఎంగా కలెక్టర్ నుంచి క్షేత్రస్థాయిలో ఉద్యోగి వరకూ అందరినీ సమన్వయంతో పనిచేయించి పొలిటికల్ గవర్నెన్సు చేస్తున్నాం. పీ4 ద్వారా పేదలను ఆదుకునేలా బంగారు కుటుంబాలను- మార్గదర్శుల ద్వారా కార్యక్రమం అమలు చేస్తున్నాం. అని చంద్రబాబు చెప్పారు.కుప్పంలో కొత్తగా ఎంపికైన పెన్షన్ లబ్దిదారులకు పెన్షన్లను సీఎం అందచేశారు. అలాగే దివ్యాంగులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. దీపం - 2.0 పథకం కింద కొత్తగా వేయి మందికి గ్యాస్ కనెక్షన్లు అందచేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా కుప్పం వచ్చిన ముఖ్యమంత్రికి చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సహా చిత్తూరు, కుప్పం స్థానిక నేతలు, జిల్లా కలెకర్ట్, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

## విశాఖలో ప్రారంభమైన సముద్ర విహారనౌక

**విశాఖ:** నగరంలో సముద్ర విహార నౌకను ఏపీ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి కేంద్రమంత్రి సోనోవాల్ ప్రారంభించారు. కేంద్రమంత్రి వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ.. విశాఖ చరిత్రలో అంతర్జాతీయ క్రూయిజ్ టర్మినల్ ఒక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రాష్టంలో క్రూయిజ్ టూరిజం అభివద్ధికి కషి చేస్తామని చెప్పారు. క్రూయిజ్ వల్ల పర్యటక రంగం అభివద్ధి చెందుతుందని చెప్పారు. క్రూయిజ్ టర్మినల్ ఏర్పాటు చేసిన విశాఖ పోర్టు అథారిటీని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు.

# తొలి అడుగు విజయవంతం

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికుల నుండి విశేష స్పందన లభించింది. నెలా మొదటి తేదీనే పెన్షన్ ఇంటికి తెచ్చి ఇస్తున్నారు. గత నెలలో రేషన్ ఇంటికే తెచ్చి ఇచ్చారు. గ్యాస్ సిలిండర్ డబ్బులు పడ్డాయి, ఇకపై నెల నెల ఇంటికే తెచ్చి రేషన్ సరుకులు అందజేస్తామని డీలర్ చెప్పారు, పాలన బాగుందంటూ ఓ పెద్దావిడ మంత్రి కొల్లు రవీంద్రతో చెప్పడంతో కార్యకర్తలు జై తెలుగుదేశం పార్టీ అనే నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందే విషయంలో ఎలాంటి లోపం లేకుండా చేయాలనే ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి అయిన సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం పనితీరు, అందిస్తున్న సంక్షేమ పథకాలపై వారి అభిప్రాయాల తెలుసుకోవటంతో పాటు ప్రజల సమస్యలు, ఇబ్బందులు తెలుసుకుంటూ ఆ సమస్యలను అధికారుల సహకారంతో అక్కడిక్కడే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయబోతున్నారని, ఇందువల్ల ఆటో డ్రైవర్ల ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ఆగస్టు 14వ తేదీ పదిహేను వేల రూపాయాలు ఆటో డ్రైవర్లకు అందించనున్నట్లు తెలిపారు. అలాగే నిరుద్యోగ భృతి కూడా నిరుద్యోగులకు అందించేందుకు డేటా సేకరణ పూర్తి అయిందని, మరో మూడు నెలల్లో నిరుద్యోగ భృతి అందించటానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వెల్లడించారు. పీ 4 లింక్ ద్వారా ప్రతి నెల మహిళలకు ప్రతినెల రూ.1500 భృతి ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైతు సంక్షేమం కోసం ఈ నెలాఖరులో అన్నదాత సుఖీభవ పథకం రైతులకు రూ.20 వేలు అందించనున్నట్లు తెలిపారు.

## విదేశాల్లో వైద్య విద్యార్థుల సమస్యల్ని పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

నేషనల్ మెడికల్ కౌన్సిల్ అధికారులతో సమావేశమయ్యి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆయన సూచించారు. విదేశీ వైద్య విద్యార్థుల పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కు సంబంధించి జాతీయ వైద్య సంఘం(ఎన్ ఎంసి) పలు విడతలుగా జారీ చేసిన ఆదేశాలు, కోవిడ్ కాలంలో ఆన్లైన్ వైద్య విద్య అభ్యసించిన వారు మన దేశంలో చేయాల్సిన ఇంటర్న్షిప్ కాలపరిమితి, విద్యార్థుల అభిప్రాయాల్ని ఎన్ ఎంసికి తెలియజేసి సమస్యకు పరిష్కార మార్గాన్ని కనుగొనాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ వైద్య సంఘం చైర్మన్ డాక్టర్ శ్రీహరిరావు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్ త్వరలో ఢిల్లీ వెళ్లి ఎన్ ఎంసి అధికారులతో భేటీ కానున్నారు. 2021 వరకు శాస్వత రిజిస్ట్రేషన్ కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికీ రిజిస్ట్రేషన్ చేశామని ఎపిఎంసి అధికారులు మంత్రికి వివరించారు. తదుపరి వచ్చిన దరఖాస్తులు మన దేశంలో చేయాల్సిన ఇంటర్న్షిప్ కాలపరిమితిపై స్పష్టత కోసం పెండింగ్లో ఉన్నాయి. తాజాగా జాతీయ వైద్య సంఘం విదేశాల్లో వైద్యవిద్యనభ్యసించిన ప్రతి విద్యార్థీ నిబంధనల మేరకు ఒకటి నుండి రెండు సంవత్సరాల పాటు భారత దేశంలో ఇంటర్న్షిప్ చేయాలని నిబంధన విధించింది. దీంతో వైద్య విద్యార్థుల సమస్యలు త్వరలోనే పరిష్కారమయ్యే అవకాశం ఉంది.

## మరో రెండు పథకాలకి గ్రీన్ సిగ్నల్.. ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకాన్ని ఈ ఏడాది ఆగస్టు 15వ తేదీ నుంచి అమల్లోకి తీసుకువస్తున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రకటించారు. అలాగే రైతులకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు ఇవ్వబోతున్నామని స్పష్టం చేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. పాలకొల్లు నియోజకవర్గంలో సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై వివరిస్తున్నామని చెప్పుకొచ్చారు. తమ పథకాలు, అభివద్ధి కార్యక్రమాలు చూసిన ప్రజలు తమది మంచి ప్రభుత్వమని చెబుతున్నారని పేర్కొన్నారు. పేదరికాన్ని పారద్రోలేలా మార్గదర్శకుల సహకారంతో పీ4ను అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అన్నింటినీ అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు మంత్రి నిమ్మల రామానాయుడు.

కూటమి పాలనలో జరిగిన సంక్షేమం, అభివద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరిస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు ఏపీ ఆర్థిక పరిస్థితిని చక్కబెడుతూనే ప్రతి ఇంటికి సంక్షేమాన్ని, ప్రగతిని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్ ఏపీ ఆర్థిక పరిస్థితిని చిన్నాభిన్నం చేసి అప్పుల పాల్జేశారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట విభజన నష్టం కన్నా.. జగన్ ఐదేళ్ల పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు.

## ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు


(మొదటి పేజీ తరువాయి)

సామాగ్రి తో తరలి వచ్చారు. ఈరోజు మేళతాళాలు, మంగళ వాయిధ్యాలు నడుమ సుమారు 300మందికి పైగా సభ్యులు గల బృందాలు విశేషరీతిలో అమ్మవారి ఆలయానికి చేరుకుని ఆషాడ సారెను అమ్మవారికి సమర్పించారు. లిఫ్ట్ మార్గం, మెట్ల మార్గం, మహా మండపం ఆరవ అంతస్తు, అన్న ప్రసాదం వద్ద సిబ్బంది ప్రత్యేక విధులు నిర్వహించి భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లను చేశారు. అమ్మవారికి భక్తులు సమర్పిస్తున్న చీరల గురించి కార్యనిర్వహణాధికారి శీనానాయక్ సిబ్బందిని వివరణ కోరారు. భక్తులు ఇచ్చే చీరలకు కంప్యూటర్లో నమోదు చేసి భద్రం చేస్తున్నామని సిబ్బంది వివరించారు. భక్తులకు ఉచిత ప్రసాదం, సామూహిక ఆశీర్వచనం అందేలా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని ఈవో ఆదేశించారు. సాయంత్రం వరకు సారె సమర్పణ బృందాల రాక కొనసాగింది.



## హసీనాకు ఆరెన్నెల్ల శిక్ష

(మొదటి పేజీ తరువాయి)



షేక్ హసీనా.. భారత్లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఆమెతో పాటు అప్పటి నేతలు, సలహాదారులు, సైనికాధికారులపై నేరారోపణలు నమోదయ్యాయి. ఢాకా కేంద్రంగా ఉన్న ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ ఇప్పటికే ఆమెకు అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆమెను స్వదేశానికి రప్పించేందుకు యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

## ముందుగా.. ట్రంప్ భార్యను దేశం నుంచి బహిష్కరించాలె

(మొదటి పేజీ తరువాయి)

మొదట అమెరికా నుంచి బయటకు పంపేయడం సరైందని భావిస్తున్నాం. బారన్ (ట్రంప్ చిన్న కుమారుడు) కూడా వెళ్లిపోవాలి. ఎందుకంటే ఆయన అమ్మమ్మ కూడా వేరే దేశంలో జన్మించారు. ట్రంప్ చెప్తున్నదాని ప్రకారం.. మీ అమ్మమ్మ అమెరికాలో జన్మించి ఉండాలి. కానీ మెలానియా తల్లి వేరే దేశంలో జన్మించారని మనకు తెలుసు. బయటకు పంపే విషయంలో మినహాయింపులు ఉండకూడదు. జాతీయ భద్రత, వలస అంశంలో ఉల్లంఘనల గురించి ట్రంప్ సీరియస్గా ఉన్నందున.. ట్రంప్ సొంత కుటుంబానికి మినహాయింపు ఇవ్వకూడదు. మెలానియా వెళ్లిపోవాలి'' అని ఆ పిటిషన్ పేర్కొంది.1970లో యుగోస్లేవియాలో మెలానియా జన్మించారు. ఆమె అసలు పేరు మెలానిజా క్నావ్స్. మోడలింగ్లో కెరీర్ను వెతుక్కొంటూ 1996లో అమెరికా వచ్చారు. 2001లో గ్రీన్కార్డ్ పొందిన ఆమె.. 2006లో యూఎస్ పౌరురాలిగా మారారు. అమెరికా వెలుపల జన్మించిన రెండో ప్రథమ మహిళ ఆమె. ట్రంప్ నిర్ణయాల నేపథ్యంలో అసలు మోడలింగ్ కోసం మెలానియా యూఎస్ వచ్చినప్పుడు చెల్లుబాటయ్యే వీసాను కలిగిఉన్నారా? అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల లాస్ఏంజెలెస్ లో జరిగిన ర్యాలీలో యూఎస్ కాంగ్రెస్ సభ్యురాలు మాగ్జిన్ వాటర్స్ ఇదే అనుమానం వ్యక్తంచేశారు. ఇక్కడ జన్మించిన వారి, అలాగే వారి తల్లిదండ్రులను పత్రాలను ట్రంప్ పరిశీలించాలను కుంటే.. తొలుత ఆయన మెలానియాకు సంబంధించిన కాగితాలను చూడాలని ఆన్‌లైన్ ఉద్యమకారులు డిమాండ్ చేశారు.

## రండి తేల్చుకుందాం.. వైసీపీ నేతలకు బోండా ఉమ మాస్ సవాల్

**విజయవాడ:** ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా అన్ని సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ తెలుగుదేశం ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు (%దీశీఅఎ ఎఎష్ట్రవఝతీ =శీ%) ఉద్ఘాటించారు. ఇవాళ(బుధవారం) సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు అడిగి తెలుసుకున్నారు. ప్రజలను కలిసి వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వంలో అంతా బాగుందని, సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉన్న డ్రైనేజి, ఇతర సమస్యలు వెంటనే పరిష్కారించాలని అధికారులకు బోండా ఉమ సూచించారు. ఈ సందర్భంగా బోండా ఉమ మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారని బోండా ఉమామహేశ్వరరావు చెప్పుకొచ్చారు. నేటి నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి నెల రోజులపాటు నిర్వహిస్తామని వెల్లడించారు. 267 పోలింగ్ స్టేషన్ల పరిధిలో తమ నియోజకవర్గంలో ప్రజల మధ్య తాము ఉన్నామని చెప్పారు. మై టీడీపీ యాప్ ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకుని వెంటనే పరిష్కారం అయ్యేలా అధికారులు చర్యలు చేపడుతున్నారని అన్నారు. ప్రజల సంతప్తి స్థాయి పెంచి, జవాబుదారీతనంతో ఉంటామని ఉద్ఘాటించారు. అధికారంలో ఉన్నా లేకున్నా.. తాము ఎప్పుడూ ప్రజల ముందుకు వస్తూనే ఉన్నామని తెలిపారు. రూ. 240 కోట్లతో సెంట్రల్ నియోజకవర్గంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపట్టామని స్పష్టం చేశారు. మహిళలకు ఉచిత బస్సు పథకం, స్త్రీ నిధిని ఈ ఏడాది ఆగస్టు నుంచి అమలు చేస్తామని ప్రకటించారు.

## అమెరికా సరిహద్దుల్లో దొరికిపోయిన 10,382 మంది భారతీయులు

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్ 2024 నాటికి డిపార్ట్మెంట్ ఆఫ్ హోమ్ల్యాండ్ సెక్యూరిటీ లెక్కల ప్రకారం అమెరికాలో 2.2 లక్షల మంది భారతీయులు ఎటువంటి పత్రాలు లేకుండా జీవిస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి 332 మందిని అక్కడి నుంచి వెనక్కి పంపారు.

భారతీయులు అక్రమ రవాణాదారుల మాటలు విని కఠిన మార్గాల్లో ప్రయాణించి అమెరికాలోకి ప్రవేశించాలనుకొంటారు. భారీ సరిహద్దు గోడ, కంచెలను తప్పించుకొనేందుకు ప్రమాదకరమైన సముద్ర మార్గాన్ని కూడా ఆశ్రయిస్తున్నారు. మే 9వ తేదీన ఇలా ప్రయాణిస్తూ కాలిఫోర్నియాలోని డెల్ మార్ సమీపంలో పడవ బోల్తాపడి భారత్ 14 ఏళ్ల బాలుడు, 10 ఏళ్ల బాలిక ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరూ అన్నా చెల్లెళ్లు. ఇలాంటి పడవలు తరచూ మెక్సికో తీరం నుంచి బయల్దేరి అమెరికాలో జలాల్లోకి చొరబడతాయి. వీటిలో ప్రయాణించిన వారు అమెరికా భూభాగంపై దిగుతారు.



## శ్రీగోవిందరాజ స్వామి వారి ఆలయంలో కన్నుల పండుగగా పుష్పయాగం

**తిరుపతి, జూలై 2(మనం న్యూస్):** తిరుపతిలోని శ్రీగోవిందరాజ స్వామి వారి ఆలయంలో బుధవారం పుష్పయాగ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం 9.30 - 11.30 గం.ల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. అనంతరం మధ్యాహ్నం 1 నుండి సాయంత్రం 4 గంటల వరకు అర్చకుల వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ పుష్పయాగం వైభవంగా జరిగింది. గత బ్రహ్మోత్సవాల్లో గానీ, నిత్య కైంకర్యాల్లో గానీ అర్చక పరిచారకులు, అధికార, అనధికారులు, భక్తుల వల్ల తెలిసీ తెలియక ఏవైనా లోపాలు జరిగి ఉంటే వాటికి ప్రాయశ్చిత్తంగా పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో తులసి, చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, రోజా, కలువలు వంటి 12 రకాల సాంప్రదాయ పుష్పాలు, తులసి, మరు వం, దమనం, బిల్వం, పన్నీరాకు వంటి 6 రకాల పత్రాలు కలిపి మొత్తం 3 టన్నుల పుష్పాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజ స్వామి వారికి పుష్పయాగం నిర్వహించారు. ఈ పుష్పాలను ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి దాతలు విరాళంగా అందించారు. సాయంత్రం 6 గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగి భక్తులను కటాక్షించారు.

ఈ కార్యక్రమంలో టిటిడి డిప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, ఏఇవో గోపినాథ్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# గరుడ వాహనంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరుడు

- నేడు పార్వేట ఉత్సవం

**తిరుపతి, జూలై 2(మనం న్యూస్):** శ్రీనివాస మంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సాక్షాత్కార వైభవోత్సవాలలో భాగంగా జూలై 02వ తేదీ గరుడ వాహనంపై శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి విహరించి భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాలసేవ, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఊంజల్ సేవ చేపట్టారు.

సాయంత్రం 06 గం.లకు ఉత్సవ మూర్తులను



వాహన మండపంలోకి వేంచేపు చేశారు. సాయంత్రం 6.30 గం.లకు లక్ష్మీ హారాన్ని ఆలయ ప్రదక్షిణగా అలంకార మండపంలోకి తీసుకువచ్చి స్వామి వారిని అలంకరించారు. రాత్రి 7 గంటలకు గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాడ వీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు.

### 3న పార్వేట ఉత్సవం

జూలై 3వ తేదీన గురువారం ఉదయం 07 - 11 గం.ల వరకు ఉత్సవ మూర్తులు పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11.00 - 02.00 గం.ల మధ్య పార్వేట ఉత్సవం జరుగనుంది. ఈ సందర్భంగా ఆస్థానం, వైదిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తిరుమలలో రవాణా శాఖ, ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్



**తిరుమల, జూలై 2(మనం న్యూస్):** ఆధ్యాత్మిక కేంద్రం తిరుపతి, తిరుమలలో రవాణా శాఖ, ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాహన యజమానులకు అపరాధ రుసుమును విధించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా తిరుమల జీఎన్ సీ టోల్గేట్ వద్ద తిరుమల ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీనివాసరావు, మోహన్ కుమార్, వెంకటరమణ నాయక్ లు 45 వాహనాలను తనిఖీ చేసి 22 వాహనాలు రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతుండటంతో ఆ వాహనాలకు రూ.1,31,220ల జరిమానాలను విధించడం జరిగిందన్నారు. రవాణా శాఖ నిబంధనలను ఉల్లంఘించి రోడ్లపై వాహనాలను నడిపితే కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా భారీ జరిమానాలను విధిస్తామని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ హెచ్చరించారు.

# శ్రీవారి భక్తులను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్

- రూ.14 లక్షలు స్వాధీనం

**తిరుమల, జూలై 2(మనం న్యూస్):** తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ పేరును దుర్వినియోగం చేసుకుని, కళాకారుల నుండి లక్షల రూపాయలు మోసగించిన వ్యక్తిని తిరుమల వన్ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 14 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.


వరంగల్ జిల్లా, కాజీపేటకు చెందిన సూత్రపు అభిషేక్ (28) అనే వ్యక్తి, తిరుమలలోని ఆస్థాన మండపంలో శ్రీనివాస కళార్చన పేరుతో రెండు రోజుల నాట్య కార్యక్రమాన్ని నిర్వహిస్తానని చెప్పి, హిందూ ధర్మ ప్రచారాపరిషత్ అధికారిక అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలుకి చెందిన 93 కళా బృందాల నుండి 2,900 కళాకారులను నమ్మించి మోసం చేసి. వారి వద్ద నుండి మొత్తం రూ.35 లక్షలను



వసూలు చేశాడు. అభిషేక్, కళాకారులకు వసతి, భోజనం, శ్రీవారి దర్శనం, ప్రసాదం, మెమెంటోలు, శాలువలు వంటి సదుపాయాలు అందిస్తామని హామీ ఇచ్చాడు. అయితే, అతను టిటిడి అధికారిక అనుమతి లేదని, ఈ మొత్తం ప్రక్రియ ఒక మోసపూరితం అని తిరుమల వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో ప్రకారం కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా తిరుమల డిఎస్పీ విజయశేఖర్ గారి ఆదేశాలతో వన్ టౌన్ సి.ఐ జి. విజయ కుమార్ ఎస్.ఐ డి. రమేష్ బాబు, సిబ్బంది మంగళవారం అభిషేక్ను అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి 14 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. అతన్ని తిరుపతి కోర్టులో హాజరు పరిచారు. టిటిడి అధికారిక అనుమతి లేకుండా ఎవరూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించారు . ఎవరైనా ఫేక్ ప్రకటనలు, అనుమతి పత్రాలు చూపిస్తే, వెంటనే స్థానిక పోలీసులకు లేదా టిటిడి అధికారులకు ఫిర్యాదు చేయాలని... అటువంటి వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## హోటళ్ల ధరలపై వస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

**తిరుమల, జూలై 2(మనం న్యూస్):** ఇటీవలి కాలంలో తిరుమలలో హోటళ్ల ధరల వివరాలు పేరుతో కొన్ని సోషల్ మీడియా వేదికల్లో విస్తృతంగా షేర్ అవుతున్న ఒక మెసేజ్ టీటీడీ దృష్టికి వచ్చింది. ఈ సమాచారం పూర్తిగా వాస్తవ దూరం. ఈ మెసేజ్లో పేర్కొన్న భోజన ధరలు, ఇతర వివరాలు పూర్తిగా కల్పితం.ఈ విధమైన తప్పుడు ప్రచారాలతో భక్తులను గందరగోళానికి గురి చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. భక్తులు ఎలాంటి సమాచారం అయినా అధికారికంగా టీటీడీ వెబ్సైట్ టీటీడీ కాల్ సెంటర్ (18004254141) ద్వారా మాత్రమే తెలుసుకోవాలని కోరడమైనది. ఎలాంటి అనుమానాస్పద సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయకుండా అధికారిక వేదికల నుంచే తెలుసుకోవాలని భక్తులకు టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది.




| ఆహార పదార్థం | గతంలోని ధర రూ. | ప్రస్తుతం రూ. |
|---|---|---|
| ఇడ్లీ(2) | 25 | 7.50 |
| చపాతి (2) | 60 | 20.00 |
| టీ | 15 | 5.00 |
| విజిటెబుల్ బిర్యానీ | 50 | 19.00 |
| ఉప్మా | 20 | 9.00 |
| పరిమిత భోజనం (ప్లేట్ మీల్స్) | 60 | 22.50 |
| భోజనం (ఫుల్ మీల్స్) | 100 | 31.00 |

# మా ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారు

- రాష్ట్ర మంత్రి టీజీ భరత్

**కర్నూలు, జూలై 2(మనం న్యూస్):** తమ ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. కర్నూలు నగరంలోని 15వ వార్డు బుధవారపేటలో ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకున్నారు. ఏ ఏ పథకాలు అందుతున్నాయో వివరాలు అడిగారు. ఏడాది కాలంలో మీకు ఏమైనా ఇబ్బందులు ఎదురయ్యాయా అని అడిగారు. అనంతరం మంత్రితో స్థానికులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు తమకు అందుతున్నాయని బదులిచ్చారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం పథకాలు తమకు వర్తించినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా వార్డులో పేరుకుపోయిన సమస్యలు కూడా పరిష్కారమయ్యాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి టి.జి భరత్కు వారు ధన్యవాదాలు తెలిపారు.



అనంతరం, మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు వివరించి, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. వార్డు మొత్తం తిరిగిన తర్వాత చిన్న చిన్న సమస్యలు తమ దృష్టికి తెచ్చారని.. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాటిచ్చిన విధంగా అన్ని హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలో మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పెన్షన్ ఇస్తున్నామని, తల్లికి వందనం, అన్నా క్యాంటిన్ల వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్తో రాష్ట్రానికి పరిశ్రమలు భారీగా వస్తున్నాయన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసేందుకు ఈ ప్రాంతానికి పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. అనంతపురం నుండి కర్నూలు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో ఎలా వ్యవహరించాలో తెలుసుకోవాలని వారికి హితవు పలికారు. లేదంటే ఇప్పుడిచ్చిన తీర్పు కూడా రాబోయే రోజుల్లో దక్కదన్నారు.

## కూటమి ప్రభుత్వం సూపర్ పరిపాలన తొలి అడుగు



**బేతంచేర్ల, జూలై 2(మనం న్యూస్):** పేదలకు సంక్షేమం అభివృద్ధి అందించడంలో కూటమి ప్రభుత్వం సూపర్ పరిపాలన అందిస్తుందని తొలి అడుగు కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని కస్టర్ 10 ఇంచార్జ్ టిడిపి కార్యదర్శి ఎస్టీ సెల్ ఎం రవీంద్ర నాయక్ ఆధ్వర్యంలో మండల పరిధిలో గోరుమానుకొండ తండా గ్రామంలో సూపరిపాలన తొలి అడుగు కార్యక్రమం వర్షం లో నే నిర్వహించారు రవీంద్ర నాయక్ మాట్లాడుతూ డోన్ ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ప్రజా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించడానికి ఎమ్మెల్యే ఎప్పుడు ప్రజల పక్షాన ఉంటారనివారు అన్నారు ఈ కార్యక్రమంలో యూనిట్ ఇంచార్జ్ శ్రీధర్ బాబు బూత్ కో కన్వీనర్ పులి నాగేశ్వరరావు నాయక్ వినాయక్ బూత్ ఇంచార్జి ఆచారి తదితరులు పాల్గొన్నారు.

## టీచర్ కళ్యాణికి మంత్రి లోకేశ్ అభినందన

- మంత్రి నివాసానికి ఆహ్వానించి అరుదైన సత్కారం
- షైనింగ్ టీచర్' పురస్కారం అందించిన మంత్రి

**పత్తికొండ, జూలై 2(మనం న్యూస్):** కర్నూలు జిల్లా, పత్తికొండ మండలం,జేఎం తండాలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు కళ్యాణి కుమారిని ఉండవల్లిలో ఉన్న తన నివాసానికి ఆహ్వానించి అరుదైన సత్కారం మానవ వనరుల అభివృద్ధి మంత్రి నారా లోకేష్ 'షైనింగ్ టీచర్' పురస్కారం అందజేశారు. ఒక సింగిల్ టీచర్గా ఉండి, పాఠశాల రూపురేఖలు మార్చి, పెద్ద సంఖ్యలో అడ్మిషన్లు తీసుకురావడం ఒక చరిత్ర. మీ నుంచి ఎంతో నేర్చుకోవచ్చు అంటూ ఆమెను మంత్రి ప్రశంసించారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తామని మంత్రి లోకేశ్



పేర్కొన్నారు. ఒక మంత్రి హోదాలో ఉన్న వ్యక్తి తనను ఇంటికి పిలిచి గౌరవించడం తన జీవితంలో మరిచిపోలేని అనుభూతి అని కల్యాణి కుమారి ఆనందం వ్యక్తం చేశారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి ఎంపిక పట్ల లక్ష్మన్న హర్షం

**తుగ్గలి, జూలై 2(మనం న్యూస్):** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపికైన పివిఎస్ మాధవ్కు కర్నూలు జిల్లా, తుగ్గలి మండల బిజెపి అధ్యక్షుడు లక్ష్మన్న హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, ఈ సందర్భంగా ఆయన కేంద్రంలో బిజెపి అధినాయకత్వం ఏపీలో కొత్త సారధిని ఎంపిక చేసి పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కూడా బిజెపి పూర్తిగా పొందుకుంటున్న ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు. అదే విధంగా మండలంలో ఎవరైనా భారతీయ జనతా పార్టీ లోనికి మరికొన్ని గ్రామాల నాయకులు చేరేందుకు సిద్ధంగా ఉన్నట్లు తుగ్గలి బిజెపి మండల లక్ష్మన్న తెలిపారు. ఇంకా బిజెపి విధి విధానాలు నచ్చి



పార్టీలోకి ఎవరైనా వస్తే కచ్చితంగా ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. ఆసక్తి కలవారు ఈ ఫోన్ నం. 9885039625లో సంప్రదించాలన్నారు.

## ఎస్సైగా బాల నరసింహులు బాధ్యతల స్వీకరణ

**తుగ్గలి, జూలై 2(మనం న్యూస్):** మండల కేంద్రమైన తుగ్గలి పోలీస్ స్టేషన్లో సబ్ ఇన్స్పెక్టర్ బుధవారం బాల నరసింహులు బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న ఎస్సై కృష్ణమూర్తి క్రిష్ణగిరికి పోలీస్ స్టేషన్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో బాల నరసింహులను తుగ్గలి ఎస్సైగా ఉన్నతాధికారులు నియమించడంతో తుగ్గలి ఎస్సై బాల నరసింహులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అయన హెచ్చరించారు.



# సీపీఐ మహాసభలను జయప్రదం చేయండి

- వేలాది మంది ప్రజలతో భారీ ప్రదర్శన
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య
- సీపీఐ 24వ జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం ఏర్పాటు

**కర్నూలు, జూలై 2(మనం న్యూస్):** భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ కర్నూలు జిల్లా 24వ మహాసభలు జూలై 28,29,30 తేదీల్లో పెద్ద ఎత్తున జరిగే మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన ఆహ్వాన సంఘ సన్నాక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి పి.రామచంద్రయ్య మాట్లాడుతూ కర్నూలు జిల్లా నిత్యం కరువు కాటకాలతో సతమవుతమవుతుందని అన్నారు. జిల్లాలో సంవత్సరాల తరబడి వేలాదిమంది ప్రజలు ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లే దుస్థితి కొనసాగుతూనే ఉందన్నారు. అనేక మంది ప్రజాప్రతినిధులుగా ఎన్నికై కేవలం వారి




యొక్క స్వార్ధ రాజకీయాలకు ప్రాంతాలను ప్రజలను వాడుకున్నారే తప్ప, నిఖార్సుగా ప్రాంతాల అభివృద్ధి ప్రజాభివృద్ధి కోరలేదని అన్నారు. ఫ్యాక్షన్ కూరల్లో చిక్కుకొని అనేక సంవత్సరాలుగా చీకటి రోజులను ఈ ప్రాంత ప్రజలు గడిపారని వారు అన్నారు. అభివృద్ధి లేక, విద్యావ్యవస్థ నిర్వీర్యమై, నూతన పరిశ్రమలు ఏర్పాటు లేక, ఉన్నఫలంగా ఉన్న పరిశ్రమలనే మూసివేయడం జరిగిందని అన్నారు.

స్వాతంత్రం సాధించి దాదాపు 78 సం వత్సరాలు గడిచిన, ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారయిందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తున్నామని అనేక మాటలు చెబుతున్నప్పటికీ, ఆ కోట్లాది రూపాయలు కేవలం రాజకీయ నాయకులు కాంట్రాక్టర్ల జోబులో మాత్రమే నిండాయని, ప్రజల కడుపులో నిండి, వారి జీవన స్థితిగతులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సాంఘిక రాజకీయ ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు అనేక దశాబ్దాలుగా సిపిఐ ఉద్యమిస్తుందని, ఎన్నో సంవత్సరాలపాటు పేద ప్రజలు ఆదరిస్తున్నారని, పీడిత, తాడిత, హరిజన, గిరిజన వర్గాల ప్రజల పక్షాన నిలిచి వేలాది ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర సీపీఐ కి సొంతమని అన్నారు. ఈ సందర్భంలోనే జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులపై, కరువు కాటకాలపై, జిల్లా సమగ్ర అభివృద్ధికై రావాల్సిన నిధులు, నియామకాలు, పరిశ్రమలు విద్యాసంస్థలపై సమగ్రంగా చర్చించేందుకు కర్నూలు జిల్లా 24వ మహాసభలకు కర్నూలు నగరం వేదిక కానుందని, ఈ మహాసభల సందర్భంగా ఎర్ర దండుతో కవాతు, వేలాదిమంది ప్రజలతో ప్రదర్శన ఉంటుందని, ఈ మహాసభల విజయవంతానికై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మేధావులు, వాణిజ్య, వర్తక వ్యాపారస్తులు ఆర్థిక, హార్దిక, సహాయ సహకారాలు ప్రత్యక్షంగా,పరోక్షంగా అందించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పి.భీమ లింగప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లెనిన్ బాబు, ఆవుల శేఖర్, జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప, కార్యవర్గ సభ్యులు లలితమ్మ, అజయ్ బాబు, నబి రసూల్, చంద్రశేఖర్, రంగన్న, కారుమంచి, శ్రీరాములు, నగర సహాయ కార్యదర్శులు మహేష్, శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు బీసన్న, వెంకటేష్, నల్లన్న, ఈశ్వర్, ప్రజాసంఘాల నాయకులు గిడ్డమ్మ, శ్రీనివాసులు, సోమన్న, షాబీర్, శరత్, నాగేంద్రమ్మ, భారతి పెద్ద ఎత్తున వివిధ శాఖల నుంచి మహిళలు, నాయకులు తదితరులు హాజరయ్యారు.

## భవన కార్మికులకు సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

- సీఐటీయూ నాయకులు ఎం.రవిచంద్ర

**పత్తికొండ, జూలై 2(మనం న్యూస్):** పత్తికొండ పట్టణంలోని స్థానిక మాజీ ఎమ్మెల్యే ఎర్రగుడి ఈశ్వర్ రెడ్డి భవనం నందు బుధవారం భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి సిఐటియు నాయకులు ఎం.రవిచంద్ర అధ్యక్షతన వహించారు. ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా నాయకులు చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి మండల కార్యదర్శి డి గోపాల్, ప్రజానాట్యమండలి జిల్లా నాయకులు కాశన్న పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలన్నారు. గతంలో లేబర్ బోర్డు ద్వారా కార్మికులకు సంక్షేమ పథకాలు అందేటివని వాటిని గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం కారణంగా కార్మికులకు అందని ద్రాక్షగా ఉన్నాయే తప్ప పూర్తిస్థాయిలో అమలు అయ్యే పరిస్థితిలో లేవన్నారు. ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ కార్యక్రమాలకు కాంట్రాక్టు ద్వారా వచ్చినటువంటి శెష్యును ప్రభుత్వాలు



వాడుకుంటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల కార్మికులకు రావాల్సిన పథకాలు అందడం లేదన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

### నూతన కమిటీ..

గౌరవ అధ్యక్షులుగా ఎం. రవిచంద్ర, అధ్యక్షులుగా భూమా, కార్యదర్శిగా దుర్గా,సహాయ కార్యదర్శిగా రాజు, ఉపాధ్యక్షులుగా కాసిం, సహాయ కార్యదర్శిగా నాగేంద్ర,మంజు,కమిటీ సభ్యులు నరసప్ప,రాజు, రంగా,నారాయణస్వామి, మరో 15 మంది కమిటీగా ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ సంఘం కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## వర్షా కాలంలో....



కొన్ని ప్రకృతి వరాలు
పరవశింప జేస్తుంటయ్
చిటపట మంటూ చినుకులు
ఇంటి రేకులపై సరిగమల సవ్వడైతది
వసారా మీదుగా నీటి బొట్లై
రాలుతున్న దృశ్యం

మనసున ముత్యాల ముగ్గుల్ని పరుస్తది
పచ్చని ఆకుల మధ్య
తచ్చాడుతున్ననీటి బిందువులు
వెండి వెలుగుల చుక్కలై మెరుస్తుంటయ్

అరటాకులే గొడుగులైన అడుగులు
కాగితప్పడవల్లే కదలాడిన బుడుగులు
వర్ష ఋతువు హర్ష స్మృతులు

వరదలతో ఊరంతా ఉప్పొంగినా
చింతచెట్టు కింద ముసలవ్వ కాల్చిన
మొక్కజొన్న పొత్తులు తింటూ
బషీర్ భాయ్ ఇచ్చిన
గరమ్ ఛాయ్ తాగుతూ..
దోస్తులతో చేసే కమ్మని కబుర్లు
మనసున మల్లెలై గుభాళించేవి

సూరన్న రవ్వంత తొంగిచూసినా..
రక్కున ఆకాశంలో
పొడుసు కొచ్చిన ఇంద్రధనస్సు
ఆనందాన్ని మోసుకొచ్చిన ఉషస్సయ్యేది

ఏరువాక సాగుతో పల్లెంతా పడుచు పిల్లయ్యేది
హరిత హారాన్ని కప్పుకున్న అడవంతా
కవి కుంచె గీసిన అక్షర చిత్రమయ్యేది..!

**- డా. కటుకోఝ్వల రమేష్**
9949083327

ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.
- ఎడిటర్

# భారత్ 'పచ్చ బంగారం' : ఐసిపివి



మనదేశం ముఖ్యంగా మన తెలంగాణ నేల అన్నం పెట్టే వ్యవసాయానికి పెట్టింది పేరు. మన రైతన్నలు పండించే పప్పు ధాన్యాలు లక్షలాది మందికి ఆహారం, బలం. కానీ, ఒక చేదు నిజాన్ని ఒప్పుకోవాలి. ప్రపంచంలోనే ఎక్కువ పప్పు ధాన్యాలు పండించే దేశం మనదే అయినా, కందిపప్పు విషయంలో మాత్రం మనం దిగుమతులపై ఆధారపడుతున్నాం. ఏటా దాదాపు 15 లక్షల టన్నుల కంది పప్పును దిగుమతి చేసుకోవడానికి 800 మిలియన్ డాలర్లు ఖర్చు పెడుతున్నాం. ఇది మన ఆహార భద్రతకు, అన్నదాతల జీవితాలకు పెద్ద సవాలు. దీనికి తోడు, రోజురోజుకీ మారి పోతున్న వాతావరణం, అకాల వర్షాలు, ఊహించని ఎండలు వ్యవసాయాన్ని మరింత గందరగోళంలో పడేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో, ఇంటర్నేషనల్ క్రాప్స్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ ది సెమీ-అరిడ్ ట్రాపిక్స్ (ఇక్రిశాట్) ఓ అద్భుతమైన కందిపప్పు వంగడాన్ని తీసుకొచ్చింది. దాని పేరే ఐసిపివి 2544. ఇది నిజంగా మన వ్యవసాయానికి ఓ కొత్త దారి చూపబోతోంది. ప్రపంచంలోనే మొట్టమొదటిసారిగా తీవ్రమైన వేడిని తట్టుకునే, ఫోటో-థర్మో ఇన్సెన్సిటివ్ కందిపప్పు రకం ఇది. అంటే, ఇది 45 డిగ్రీల సెల్సియస్ వరకు ఉండే ఉష్ణోగ్రతలను తట్టుకోగలదు. అంతేకాదు, కేవలం 125 రోజుల్లోనే కోతకు వస్తుంది. ఇప్పటివరకు కొన్ని నెలలకే పరిమితమైన కంది పప్పును సంవత్సరం పొడవునా పండించే అవకాశం కలగడం ఒక పెద్ద విప్లవం అనొచ్చు.

**ఆవిష్కరణల ప్రతిరూపం**

ఐసిపివి 25444 అనేది సాధారణ రకం కాదు, ఇది ఓ అసాధారణ వంగడం. దీని ముఖ్య లక్షణం దాని అద్భుతమైన వేడి నిరోధకత. వేసవిలో మండుటెండల్లో కూడా దీన్ని పండించుకోవచ్చు. ఇది 'ఫోటో-థర్మో ఇన్సెన్సిటివ్' కావడం వల్ల, పంట పెరుగుదల పగటిపూట సూర్యరశ్మి లేదా ఉష్ణోగ్రతలపై ఆధారపడదు. గతంలో కందిపప్పును కొన్ని సీజన్లలో మాత్రమే పండించడానికి ఇదే కారణం. కర్ణాటక, ఒడిశా, మన తెలంగాణలో చేసిన పరీక్షల్లో ఇది హెక్టారుకు 2 టన్నుల దిగుబడి నిచ్చింది. ఇది మన దేశ వాతావరణ పరిస్థితుల్లో ఎంత బాగా పండుతుందో దీని ద్వారా అర్థమవుతుంది. ఈ అద్భుతం అనుకోకుండా జరిగింది కాదు. ఇది ఇక్రిశాట్ 2024లో రూపొందించిన 'ప్రపంచంలోనే మొట్టమొదటి కందిపప్పు స్పీడ్-బ్రీడింగ్ ప్రోటోకాల్' ఫలితం. ఈ కొత్త పద్ధతి పంటల అభివృద్ధి కాలాన్ని గణనీయంగా తగ్గించింది. సాధారణంగా కొత్త వంగడాలను అభివృద్ధి చేయడానికి 15 సంవత్సరాలు పట్టేది. కానీ ఇప్పుడు కేవలం ఐదేళ్లలోనే పూర్తి చేయొచ్చు. ఈ ప్రోటోకాల్ వల్ల శాస్త్రవేత్తలు సంవత్సరానికి నాలుగు సార్లు పంటలను పండించి,



ఆధునిక జన్యు సాంకేతికతలను ఉపయోగించి విత్తన ఉత్పత్తిని, జన్యు విశ్లేషణను వేగవంతం చేస్తున్నారు. 'అవసరం, సంకల్పం' ఉంటే సైన్స్ ఏమైనా సాధించగలదని ఇది నిరూపిస్తుంది.

**భవిష్యత్ ప్రణాళికలు, విస్తృత ప్రయోజనాలు:**

ఐసిపివి 25444 రాకతో మన కందిపప్పు కొరతను తీర్చడానికి, వ్యవసాయ రంగం మరింత బలంగా మారడానికి రెండు రకాల వ్యూహాలు అమలు చేయవచ్చు. ఒకటి, ఇప్పటికే ఉన్న సాగు భూముల్లో ఎక్కువ దిగుబడి కోసం ఈ కొత్త రకాన్ని ఉపయోగించడం (నిలువువిస్తరణ). రెండోది, ఇంకా పండించని భూముల్లోకి, ముఖ్యంగా వేసవి కాలంలో ఖాళీగా ఉండే భూముల్లోకి సాగును విస్తరించడం (క్షితిజ సమాంతర విస్తరణ). దీని వేడిని తట్టుకునే సామర్థ్యం, తక్కువ కాలపరిమితి రబీ (శీతాకాలం)లో వరి కోత తర్వాత మిగిలిన పొలాల్లో, సాగునీటి సౌకర్యాలున్న ఖాళీ వేసవి భూముల్లో పండించడానికి ఎంతో అనుకూలం. ముఖ్యంగా, సాగునీటి వ్యవస్థల చివర ఉండే 20 నుండి 30 లక్షల హెక్టార్ల 'టెయిల్-ఎండ్ కమాండ్ ఏరియాస్' లో ఇది పెద్ద మార్పు తీసుకురాగలదు. ఈ ప్రాంతాల్లో నీటి కొరత వల్ల రెండో పంటలు సరిగా పండవు. ఇక్కడ హెక్టారుకు 1.5 నుండి 2 టన్నుల దిగుబడినిచ్చే కందిపప్పును పండించడం వల్ల రైతుల ఆదాయం పెరుగుతుంది. అంతేకాకుండా గతంలో నిరుపయోగంగా ఉన్న కాలాలను కూడా లాభదాయకంగా మార్చుకోవచ్చు. ఏడాది పొడవునా కందిపప్పు పండించగలిగే అవకాశం మన వ్యవసాయానికి గొప్ప వరం.

ఇది రైతులకు పంటల మార్పిడిలో స్వేచ్ఛనిస్తుంది, ఆదాయ మార్గాలను పెంచుతుంది. ఒక సీజన్ పంట పాడైతే వచ్చే నష్టాన్ని తగ్గిస్తుంది. వాతావరణ మార్పులు, ఊహించని వాతావరణ పరిస్థితుల్లో ఈ బలం మనకు చాలా అవసరం. దేశీయంగా కందిపప్పు ఉత్పత్తి పెరిగితే, మార్కెట్లో ధరలు స్థిరంగా ఉంటాయి, వినియోగదారులకు కూడా అందు బాటులో ఉంటాయి. ఇది మన దేశ ఆహార భద్రతను బలో పేతం చేస్తుంది. అంతేకాదు, కందిపప్పు దిగుమతులపై ఏటా ఖర్చు చేసే 800 మిలియన్ డాలర్లు ఆదా అవుతాయి. ఈ సొమ్మును ఇతర ముఖ్యమైన అభివృద్ధి పనులకు ఉపయోగిం చవచ్చు.

**సవాళ్లు, మన ముందున్న మార్గం**

ఐసిపివి 25444 అద్భుతమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ, దీనిని దేశవ్యాప్తంగా విస్తృతంగా అమలు చేయడానికి కొన్ని సవాళ్లను అధిగమించాలి. చాలా మంచి దిగుబడినిచ్చే వంగడాలు అందుబాటులో ఉన్నా, మన దేశంలో కందిపప్పు ఉత్పత్తి ఇంకా నిలకడగా లేదు. దీనికి కారణం, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, మెరుగైన సాగు విధానాలు ఇంకా పూర్తిస్థాయిలో రైతులకు చేరకపోవడమే.

**అడ్డుగా నిలిచే కొన్ని ముఖ్యమైన సమస్యలు**

నాణ్యమైన విత్తనాల సరఫరా కొరత, జీవన ఎరువుల వాడకంలో సవాళ్లు, ఎక్కువ శ్రమతో కూడిన సాగు, పంట కోసిన తర్వాత వచ్చే సమస్యలు వంటి మౌలిక సదుపాయాల కొరతలు వెంటాడతాయి. అంతేకాకుండా చాలామంది రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన లేదు. ధరల్లో హెచ్చుతగ్గులు కూడా వారి సాగు నిర్ణయాలను ప్రభావితం చేస్తాయి.

**పరిష్కారాలు**

ఈ పంటపై పూర్తి ప్రయోజనాలను పొందాలంటే, మనం సమగ్ర విధానాన్ని అవలంబించాలి. రైతన్నలకు కొత్త పద్ధతుల గురించి వివరించడానికి బలమైన వ్యవసాయ విస్తరణ సేవలు అవసరం. వారికి నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలి. సాగునీటి సౌకర్యాలను మెరుగు పరచాలి. మార్కెట్లో ధరలను స్థిరంగా ఉంచాలి. రిమోట్ సెన్సింగ్, జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ వంటి ఆధునిక పద్ధతులను ఉపయోగించి, మెరుగైన సాగు విధానాలతో, విత్తన సరఫరా వ్యవస్థలను పటిష్టం చేసి 15 లక్షల హెక్టార్లకు సాగును విస్తరించాలి. ఇక్రిశాట్ వంటి పరిశోధనా సంస్థలు, వాణిజ్య విత్తన కంపెనీల మధ్య బలమైన భాగస్వామ్యాలను ప్రోత్సహించడం ఇలాంటి ఆవిష్కరణలు నిరంతరం కొనసాగడానికి, విస్తృతంగా రైతులకు చేరడానికి చాలా ముఖ్యం. ఐసిపివి 25444 కేవలం ఒక కొత్త వంగడం కాదు. ఇది మన శాస్త్రవేత్తల ప్రతిభకు నిదర్శనం. మన దేశ వ్యవసాయ భవిష్యత్తుకు ఓ ఆశాకిరణం. కందిపప్పుకు ఉన్న కాలపరిమితిని తొలగించి, ఇది నిజంగా 'అన్ని కాలాల కందిపప్పు'గా మారబోతోంది. వేడిని తట్టుకునే దీని శక్తి, వేగంగా పండే దీని గుణం మన దేశ కందిపప్పు కొరతకు ఓ చక్కటి పరిష్కారం.

**అండగా నిలవాలి**

ఆర్థిక ప్రయోజనాలకు మించి ఈ వంగడం మన దేశ ఆహార భద్రతను పెంచుతుంది. వాతావరణ మార్పులను తట్టుకునే శక్తిని మన వ్యవసాయానికి ఇస్తుంది. ఇది రైతులకు ఎక్కువ విలువనిచ్చే, మార్పులకు అనుగుణంగా ఉండే పంటను అందిస్తుంది. అనూహ్య వాతావరణ మార్పుల కాలంలో, ఇది వారికి ఎక్కువ ఆదాయ మార్గాలను, స్థిరత్వాన్ని ఇస్తుంది. మన దేశం వాతావరణ మార్పుల సవాళ్లను, ఆహార అవసరాలను ఎదుర్కొంటున్నప్పుడు ఇటువంటి ఆవిష్కరణలు కేవలం వ్యవసాయ పురోగతులు మాత్రమే కావు. అవి మన దేశానికి మరింత సురక్షితమైన, సంపన్నమైన, స్థిరమైన భవిష్యత్తుకు పునాదులు. ఈ 'పచ్చ బంగారం' మన పొలాలను సుసంపన్నం చేసి మన రైతన్నలకు అండగా నిలుస్తుందని ఆశిద్దాం.

**- జనక మోహన రావు దుంగ**
8247045230

# ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్





నేడు ప్రపంచమంత ప్లాస్టిక్‌మయం అయ్యింది. ప్లాస్టిక్ కనబడని గృహం లేదు, వాడని మనిషి లేడు. ఎక్కడ చూసినా ఏమున్నదా గర్వకారణం, సర్వం గరళ ప్లాస్టిక్ బ్యాగుల బూతమే. వాడడానికి సౌకర్యంగా, మన్నిక కలిగిన గుణాలు ప్లాస్టిక్స్ స్వంతం. చెవులను శుభ్రం చేసుకునే ఇయర్ బడ్ నుంచి, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, పాలు/నూనె/ద్రవాల ప్యాకెట్లు, వాటర్ పాటిల్స్, పానీయాలు తాగే స్ట్రాలు, వంటింటి సరుకులు నిల్వ చేసే డబ్బాలు, కుర్చీలు, పలు రకాల పర్నీచర్లు, పిల్లల ఆట బొమ్మల వరకు ఎక్కడ చూసినా, ఏ దుకాణానికి వెళ్లినా సర్వం ప్లాస్టిక్ వస్తువులు లేదా ప్యాకేజ్‌లు కనిపిస్తున్నాయి. నాడు కర్రకు ప్రత్యామ్నాయంగా, వరప్రసాదంగా 1930ల్లో కనుగొనబడి, 1970-1980లో వాడకం మొదలైన ప్లాస్టిక్ ఉత్పత్తులు నేడు సముద్ర జలాలు, సాగు నేలలను సహితం విషతుల్యం చేసే దుస్థితి వరకు ప్లాస్టిక్ బూతం చేరింది.

వాడి పడేసిన ప్లాస్టిక్ ఉత్పత్తులు జీవ విచ్ఛిన్నం కావడానికి 100 నుంచి 1000 ఏండ్లు పడుతున్నది. రసాయనశాస్త్ర పరంగా చిన్న చిన్న అణువు అనేకం రసాయన చర్యల ద్వారా కలిసి అతి పెద్ద శృంఖలాలు ఏర్పడి, ప్లాస్టిక్ బృహదణువులుగా లేదా పాలిమర్లా పిలువబడతాయి. పాలిథీన్ కవర్స్, పివిసి పైప్స్ లాంటి ప్రధాన ప్లాస్టిక్ ఉత్పత్తుల గూర్చి మనకు తెలుసు.

**అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం**

ఒక నాడు షాపుల్లో పర్యావరణహిత పేపర్ ప్యాకింగ్ చేసే అలవాటు ఉండేది. మనం ఏ వస్తువును కొన్నా ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల్లోనే ఇంటికి తెచ్చుకుంటాం. ప్రపంచవ్యాప్తంగా సాలీనా 5 ట్రిలియన్ల ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేయబడడం, నిమిషానికి 1 మిలియన్ బ్యాగులు వాడడం, ప్రతి మనిషి సగటున 25 నిమిషాలకు ఒక ప్లాస్టిక్ బ్యాగు వాడడం జరుగుతున్నది. విచ్చలవిడిగా, విచక్షణారహితంగా వాడుతున్న ప్లాస్టిక్ బ్యాగుల పర్యావరణానికి అత్యంత ప్రమాదకరమని మేల్కొనవలసిన సమయం ఆసన్నమైంది. ప్లాస్టిక్ బ్యాగుల వినియోగంతో దాదాపు ఒక లక్ష సముద్ర జంతువుల మనుగడ ప్రశ్నార్థకం అయ్యింది. ఈ ప్రమాదాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రమాదకర ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం పట్ల అవగాహన కల్పించడానికి, వాటి దుష్ప్రభావాలను వివరించడానికి ప్రతి ఏట 03 జూలై రోజున అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం పాటించుట ఆనవాయితీగా వస్తున్నది. అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినం వేదికగా ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని పూర్తిగా తగ్గించడం, వాటి విష ప్రభావాలను వివరించడం, వాటికి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వెతకడం, పర్యావరణ పరిరక్షణకు కంకనబద్దులు కావడం లాంటి అంశాలను అవగాహన పరుస్తారు.

**ప్లాస్టిక్ బ్యాగులు లేని**
**పౌర సమాజ నిర్మాణం సాధ్యమా!**

మన ఇంట్లో ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించుకోవడం, ప్లాస్టిక్ కవర్ను బదులుగా పేపర్ లేదా క్లాత్ బ్యాగులు వాడడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులను నిషేధించడం, తప్పనిసరి అయినపుడు ఒక్క ప్లాస్టిక్ బ్యాగును తిరిగి పలుమార్లు వాడడం, ప్లాస్టిక్ బ్యాగులు లేని మార్కెటింగ్ రోజులను తిరిగి పొందడం, సహజ ఉత్పత్తులతో బ్యాగులను తయారు చేసుకొని వాడడం లాంటి చర్యలకు పూనుకోవలసిన సమయం ఆసన్నమైంది. ఇలాగే నిర్లక్ష్యం చేస్తే మైక్రో ప్లాస్టిక్ అవశేషాలు మానవ శరీరంలోకి చేరి తీవ్ర అనారోగ్యాలకు కారణం కావడం, సకల జీవ కోటి మనుగడ ప్రశ్నార్థకం కావడం జరుగుతుంది. నేడు ప్లాస్టిక్ వ్యర్థాలు భూగ్రహానికి శాపాలుగా మారుతున్నాయి.

సారవంతమైన నేలల్ని, సముద్ర నదీ జలాలను ప్లాస్టిక్ బ్యాగులు కలుషితం చేస్తు న్నాయి. అన్నీ తెలిసిన నరుడు నరకానికి నిచ్చె నలు వేస్తున్నాడు. తను ప్రమాదంలో పడడమే కాకుండా సకల జీవరాశులను కూడా ప్రమాదం లోకి నెడుతున్నాడు నేటి డిజిటల్ యుగపు మానవుడు. అందుకే తక్షణమే ప్లాస్టిక్ బ్యాగు రహిత సమాజ స్థాపనకు ప్రతినబూనుదాం, మన రేపటి ఆరోగ్యాలను మనమే కాపాడుకుందాం.

**(3 జూలై అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినం)**

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# యుద్ధం ఏం సాధించింది?





పన్నెండు రోజులుగా కొనసాగిన ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం అమెరికా అధ్యక్షుడి 'ట్రూత్' మెస్సేజ్ తర్వాత నెమ్మదించింది. కొన్ని ఉల్లంఘనలు జరిగినా.. 2025 జూన్ 24 నుంచి సీజ్ ఫైర్ అమలులోకి వచ్చింది. అప్పుడు ఇరాన్‌లో అణు స్థావరాల ధ్వంసం తనకు దక్కిన గౌరవంగా ట్రంప్ ప్రకటించుకున్నారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నిర్వీర్యం చేశామని, బాలిస్టిస్ మిస్సైల్ సామర్థ్యాన్ని ధ్వంసం చేశామని, సైనిక నాయకత్వానికి తీవ్ర నష్టం కలిగించామని, ఇది తమ విజయమని ఇజ్రాయెల్ ప్రకటించింది. గట్టిగా పోరాడడం వల్లే ఇజ్రాయెల్, అమెరికా దిగివచ్చాయని, సీజ్ ఫైర్ కోసం అమెరికా తమను బతిమాలిందని ఇరాన్ చెప్పింది. పన్నెండు రోజుల యుద్ధానికి విరామమిచ్చి.. ఒక వారం గడిచినా.. యుద్ధంలో ఎవరు ఏం సాధించారో గొప్పలు చెప్పుకోవడం తప్ప.. ఇప్పటికీ దేనిపైనా స్పష్టత లేకుండాపోయింది.

ఇజ్రాయెల్-ఇరాన్ వార్ మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందేమోననే ఆందోళనలు విశ్వవ్యాప్తంగా నెలకొనగా.. ట్రంప్ ప్రకటన తర్వాత ఒకటే సారి సీజ్ ఫైర్ నిర్ణయం జరిగింది. అయితే ఇందులో ఇరాన్, అమెరికా చాకచక్యంగా వ్యవహరించినట్టు అర్థమవుతున్నది. బంకర్ బస్టర్ బాంబులతో తమ అణుస్థావరాలపై దాడికి ప్రతిఘటనగా ఖతర్ లోని అల్ ఉదెద్ ఎయిర్ బేస్ పై దాడి చేసినట్టు ఇరాన్ ప్రకటించింది. అయితే దీనికి సంబంధించి ఖతార్, అమెరికాలకు ముందస్తు సమాచారమివ్వడంతో ఆ దేశాలు అప్రమత్తమై నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. ఆ తర్వాత ట్రంప్ ఇరాన్ కు థాంక్యూ చెబుతూనే.. యుద్ధ విరమణకు ప్రయత్నాలు చేశారు. ఖతర్ సహకారంతో ఇరాన్ సీజ్ ఫైర్‌కు అంగీకరించేలా చేయగలిగారు. అయితే యుద్ధం వల్ల రోజుకు రూ. వేల కోట్లు ఖర్చు అవుతుండడం, ఆయుధ నిల్వలు తగ్గిపోతుండడం, అంతర్జాతీయ ఒత్తిడి కారణంగా ఇరాన్, ఇజ్రాయెల్‌లు సీజ్ ఫైర్‌కు ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది.

నోబెల్ శాంతిబహుమతి కావాలని ట్రంప్ బలంగా కోరుకుంటున్నారు. ఇందుకోసం ఇప్పటికే రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధ విరమణను ప్రయత్నించి విఫలమయ్యారు. భారత్-పాకిస్తాన్ యుద్ధం తనవల్లే ఆగిందని గొప్పలు చెప్పుకుంటున్నారు. ఇప్పుడు ఇరాన్ -ఇజ్రాయెల్ యుద్ధాన్ని తానే ఆపినట్లు కనిపిస్తే.. నోబెల్ శాంతి బహుమతి తనకు వచ్చే అవకాశముందని భావించే ట్రంప్.. ఖతర్‌లోని అమెరికాకు చెందిన అల్ ఉదేద్ ఎయిర్ బేస్పై దాడి జరిగినా స్పందించకుండా.. యుద్ధ విరమణ ప్రయత్నాలు చేశారని విశ్లేషకులు భావిస్తున్నారు. కాగా, ఇరాన్-ఇజ్రాయెల్ సీజ్‌ఫైర్‌కు, ఇరాన్ అణు కార్యక్రమాన్ని అడ్డుకున్నందుకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని ఇప్పటికే జార్జియా రిపబ్లికన్ రిప్రజెంటేటివ్ బడ్డీ కార్టర్ ట్రంప్ పేరును నోబెల్ శాంతి బహుమతికి ప్రతిపాదించారు. మిడిల్ ఈస్ట్‌లో అమెరికా యుద్ధాలను గతంలో ట్రంప్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఇరాన్ అణు కార్యక్రమాన్ని నష్టం చేయడమే తమ లక్ష్యమని, అది పూర్తయిందని ఇప్పటికే ట్రంప్ ప్రకటించడం గమనార్హం.

ఈ యుద్ధంలో తమది చారిత్రాత్మక విజయమని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ఇప్పటికే ప్రకటించారు, ఇరాన్ పరమాణు కార్యక్రమం, బాలిస్టిక్ మిస్సైల్ సామర్థ్యాలను గణనీయంగా నాశనం చేశామని ఇజ్రాయెల్ చెబుతున్నది. ఈ దాడులు ఇరాన్ను అణ్వాయుధ సామర్థ్యం నుండి సంవత్సరాల వెనక్కి నెట్టిందని వాదిస్తున్నది. 30 మంది ఇరాన్ ఉన్నతస్థాయి మిలటరీ నాయకులను, కీలక అణుశాస్త్రవేత్తలను మట్టుబెట్టామని చెబుతున్నది. అయితే తాము హతమార్చామని ఇజ్రాయెల్ చెబుతున్న ఇద్దరు కీలక వ్యక్తులు మళ్లీ ఇరాన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొని కనిపించడం గమనార్హం. మరోవైపు ఈ యుద్ధంలో తామే విజయం సాధించామని ఇరాన్ ప్రకటించుకున్నది. దేశంలో పెద్ద ఎత్తున విజయోత్సవ సంబురాలు నిర్వహిస్తున్నది. ఇరాన్ మిస్సైల్స్ ఇజ్రాయెల్ ఐరన్ డోమ్ రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని ఇరాన్ చెబుతున్నది. తమ పరమాణు కార్యక్రమం కొనసాగుతుందని, ఐఏఈఏ ఒప్పందం నుంచి బయటకు వస్తున్నట్లు ఇరాన్ పేర్కొంటుండడం గమనార్హం. అయితే ఎవరి వాదనలు ఎలా ఉన్నా.. ఈ యుద్ధం మరింత పెరగకుండా ప్రపంచ దేశాలను ఊపిరి పీల్చుకునేలా చేసింది. అయితే గాజాలోని పాలస్తీనా పౌరులపై ఇజ్రాయెల్ చేస్తున్న మారణకాండను ఆపేందుకు నోబెల్ శాంతి బహుమతికి ప్రయత్నిస్తున్న ట్రంప్ సహకరిస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

**- మహమ్మద్ ఆరిఫ్**
7013147990

# పోతరాజు వేషధారణలో విపరీత పోకడలు ఎందుకు?



ఆషాడ మాసంలో జంట నగరాలలో, శ్రావణ మాసం తెలంగాణ పల్లెలలో జరిగే పండుగ బోనాలు. తెలంగాణలో అత్యంత ఉత్సాహంతో సకలజనులు జరుపుకునే పండగ. గ్రామదేవతలైన మైసమ్మ, పోచమ్మ, ఎల్లమ్మ ఈదమ్మ, పెద్దమ్మ ,చౌడమ్మ పోలేరమ్మలకు బోనం పెడతారు. సాధారణ స్త్రీలు బోనాలుచేసి భక్తి తో ఎత్తుకుంటారు. కొందరు శివసత్తులులు మూడంత్రాల బోనం, ఏడంత్రాల బోనం చేస్తారు. ప్రతి అంతరంలో ప్రత్యేకంగా బెల్లన్నం(పరమన్నం) పెరుగన్నం, పాలన్నం, తెల్లన్నం లాంటి ఆహార పదార్థాలను బోనంలో పెట్టి ఊరేగింపుగా బయలుదేరుతారు. ఊరగింపు సమయంలో బోనాలకు రక్షణగా గ్రామదేవతలైన ఏడుగురు అక్కల ముద్దుల తమ్ముడైన పోతరాజు ముందు నడుస్తాడు. దుష్టశక్తులను దరిచేరకుండా వీర గోలలు పెడేల్ పెడేల్ మంటు వీరంగం వేస్తాడు. డప్పుల మోతలు, జెమడికే చప్పుళ్ళు, డిల్లెం బొల్లెం దరువులకు అనుగుణంగా అడుగులేస్తాడు. పోతరాజు విన్యాసాలు చేస్తుంటే చూసి ఆనందించని వారుండరు. వారి వీరగోలల చప్పుడుకు అదరని వారుండరు.

పోతరాజు వేషధారణ విషయంలో పెయ్యంత పసుపు బండార్లు రుద్దుకుంటారు. గజ్జల లాగేసుకుంటారు. పిక్కలకు మువ్వలు, కాళ్లకు గజ్జెలు కట్టుకుంటారు. గొర్రె ఉన్నితో చేసిన శాలువా లాంటి వస్త్రం నడుముకు చుట్టుకుంటారు. చేతిలో జనుపనారతో చేసిన వీరగోలలు పట్టుకుంటారు. కొందరు తల వెంట్రుకలు సహజంగా పెంచుకుంటారు. మరి కొందరు విగ్గు పెట్టుకుంటారు. ఒక్కొక్కసారి చేతిలో శూలం, కత్తి లాంటివి కూడా పట్టుకుంటారు. ప్రతిచోట పోతరాజు వేషధారణ అటు ఇటుగా ఇలాంటి ఆహార్యంతోనే ఉంటుంది. పోతరాజు వేషధారులు భక్తితో ప్రదర్శన ఇస్తూ భక్తులను అలరిస్తారు.

ఒకప్పుడు ఈ పోతరాజు వేషాలు ప్రత్యేకంగా కొందరు మాత్రమే వేసేవారు. కొందరు శివసత్తులుగా ఉండి వృత్తిగా స్వీకరించేవారు. వారు వివిధ సందర్భాలలో అంటే దేవుని లగ్గం, ఇంటి లగ్గం, మల్లన్న పండగ, బీరప్ప పండగ, గంగ బోనం, మైలలు తీసిసుడు, కొన్ని బహుజన కులాలలోని పెళ్లిళ్ల సందర్భంగా ఈ పోతరాజు వేషాలు వేస్తారు.

ఈ మధ్యకాలం లో కొంతమంది యువకులు ఉత్సాహంతో పోతరాజు వేషధారణ చేసి అలరిస్తున్నారు. అందులో తప్పు పట్టవలసినది ఏమీ లేదు. అత్యుత్సాహంతో పోతరాజు వేషధారణలో కొంచెం అతిగా ప్రవర్తిస్తున్నట్టు అనిపిస్తుంది. ముఖ్యంగా పసుపు బండార్లలకు బదులుగా వేరువేరు రంగులతో వేషధారణ చేస్తున్నారు. పసుపు బండార్లలో ఉన్న పవిత్రత, భక్తి భావన ఇలాంటి వేషధారణలో కనిపించడం లేదు. కాబట్టి మన సంస్కృతి ,సంప్రదాయాలకు, పండుగలకు సంబంధించిన విషయం కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవలసిన బాధ్యత మనందరిది.

ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాల ప్రభావం ప్రజల మీద విపరీతంగా ఉంది. బోనాలు గాని, బతుకమ్మ గాని, పోతరాజుల వేషధారణ గాని ప్రత్యేక సందర్భాలలో పవిత్రంగా చేసుకునేవి. కానీ ఈ మధ్యకాలంలో ప్రతి వేదిక దగ్గర, సమయం కాని సమయాలలో, రాజకీయ వేదికల దగ్గర కనిపిస్తున్నవి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు తెలియని వారికి తప్పుడు సందేశం వెళ్ళే అవకాశం ఎక్కువగా ఉంది. చేసే పని ఏదైనా మన సంస్కృతి సంప్రదాయాలకు గౌరవం పెంచేదిగా ఉండాలి. తెలంగాణ ప్రజానీకం ఆ విధంగా ఆలోచిస్తారని కోరుకుంటున్నాను.

**- డా. ఎడ్ల కల్లేశ్**
9866765126

# జెట్ స్పీడ్‌లో కూటమి పథకాల అమలు

- **విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**విజయవాడ తూర్పు, జూలై 02 (మనం న్యూస్):** గత ప్రభుత్వ హయంలో రాష్ట్ర ప్రజలు సంక్షేమానికి, అభివృద్ధికి దూరంగా వున్నారు. అందుకే ఎన్డీయే కూటమి అధికారంలో రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్రంలో లోటు బడ్జెట్ లో వున్న సంక్షేమం, అభివృద్ధి ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో అధికారంలో రాగానే చెప్పిన విధంగా పెన్షన్ వెయ్యి రూపాయలు పెంచి...ప్రతి నెల ఒకటో తారీఖు నాలుగు వేల రూపాయలు ఎన్డీయే కూటమి అందించటంతో పాటు సూపర్ సిక్స్ పథకాలు జెట్ స్పీడ్ లో అమలు చేస్తోందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 50వ, 55వ డివిజన్ లో ఎంపీ కేశినేని శివనాథ్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా,ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు లతో కలిసి ఇంటింటికి వెళ్లి ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏడాదిగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. వారి అందుతున్న సంక్షేమ పథకాలపై ప్రజల అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబం ఎంపీ కేశినేని శివనాథ్ కి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై వారి ఆనందం వ్యక్తం చేశారు. తల్లికి వందనం ఒకటి రెండు కుటంబాలు పడలేదనే విషయం ఎంపీ కేశినేని శివనాథ్ దృష్టికి రాగా, వారికి వచ్చే విధంగా ప్రయత్నం చేస్తామని తెలియజేశారు. అదే విధంగా పలు ప్రజల సమస్యలు ఆయన దృష్టికి తీసుకురాగా ఎంపీ కేశినేని శివనాథ్ సంబంధిత అధికారులతో




మాట్లాడి ఆ సమస్యలను సత్వరమే పరిష్కారము చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ రాష్ట్రం లోటు బడ్జెట్ లో ఉన్నసంక్షేమం, అభివృద్ధి విషయంలో ఎక్కడ రాజీ పడకుండా రాష్ట్రాన్నిముందుకు తీసుకువెళుతున్న ముఖ్యమంత్రి చంద్‌బాబు నాయుడు కృషిని, అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో వివరించటం జరిగిందన్నారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై పోరాడామని, అధికారం లో వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం ప్రజల్లోనే వుంటున్నామన్నారు.అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయటం జరిగిందన్నారు. వైసిపి నాయకులు చెప్పే దానికి చేసే దానికి పొంతన వుండదన్నారు. వైసిపి హయంలో ప్రజలను పీడించి, రాష్ట్రాన్నిదోచుకు తినటమే జరిగిందన్నారు. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ కోసం పర్యటనలు చేసే ఆరాచక శక్తులు ప్రజల చెంతకి వస్తే తగిన బుద్ది చెప్పటానికి సిద్దంగా వున్నారని హెచ్చరించారు. తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతిపక్షంలో వున్నా, అధికారంలో వున్నా నిత్యం ప్రజలతో వుంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి రాష్ట్రాభివృద్దికి కృషి చేస్తారని, వైసిపి నాయకులాగా ఇంట్లో కూర్చొని బూటకపు మాటలు చెప్పమన్నారు. ఈ కార్యక్రమంలో 55వ డివిజన్ అధ్యక్షుడు ఎమ్.డి. జాహీద్, 50వ డివిజన్ అధ్యక్షురాలు కొప్పుల గంగ అరుణ శ్రీ, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండి రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## తొలి అడుగులో అభివృద్ధిపై అవగాహన

**విజయవాడ సెంట్రల్ , జూలై 02 (మనం న్యూస్)** బుధవారం నాడు ఉదయం ఎన్డీఎ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని 27వ డివిజన్ దుర్గాపురం సాంబమూర్తి రోడ్ తో పాటు పలు ప్రాంతాలలో పర్యటించి ప్రభుత్వం చేసిన పలు అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలన గురించి ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ 4వ సారి ముఖ్యమంత్రిగా తొలి ఏడాది పూర్తి చేసుకున్న చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాను శాసనసభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఇప్పటి వరకు రూ.240 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. అర్హత కలిగిన ప్రతి



లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు తమ పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. సెంట్రల్ నియోజకవర్గంలో మొత్తం 267 పోలింగ్ బూత్ల పరిధిలో 2.60 లక్షల ఓటర్లను కలసి కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల ను వివరిస్తామని, ప్రజల మధ్యే ఉంటూ, వారి మద్దతుతో సుపరిపాలనను కొనసాగిస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ 27వ డివిజన్ ఇంచార్జ్ నవనీతం సాంబశివరావు, నియోజకవర్గ పరిశీలకులు దేవతోటి నాగరాజు, ఘంటా కృష్ణమోహన్, 27 వ డివిజన్ అధ్యక్షులు దాసరి జయరాజు, ప్రధాన కార్యదర్శి మల్లంపల్లి సురేష్, మద్దల రుక్మిణి, బత్తుల శివ తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయాల పైన ఇచ్చిన వివాదాస్పద జీవోను వెంటనే రద్దు చేయాలి

- **శ్రీ శ్రీనివాసనంద సరస్వతీ స్వామీజీ**



**విజయవాడ సెంట్రల్, జూలై 02 (మనం న్యూస్)** దేవాలయాల పైన ఇచ్చిన వివాదాస్పద జీవోను వెంటనే రద్దు చేయాలని శ్రీ శ్రీనివాసనంద సరస్వతీ స్వామీజీ అన్నారు. బుధవారం నాడు విజయవాడ గాంధీనగర్ లోని ఐలాపురం హోటల్లో ఏర్పాటు చేసిన జాతీయ హిందూ ధార్మిక సదస్సుకు అధ్యక్షత వహించి ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పి వి ఎన్ మాధవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శ్రీనివాసనంద సరస్వతీ స్వామీజీ, పి వి ఎన్ మాధవ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించాలని, భారతీయ అత్యుత్తమ విలువలను ఇప్పటికీ కూడా ప్రపంచంలో 80 శాతం ప్రజలు తెలుసుకో లేకపోతున్నారన్నారు. ప్రధాని మోడీ నాయకత్వంలో భారతదేశం ఇటీవల నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమం ద్వారా భారతీయ ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. భారతదేశం విశ్వగురు అయ్యే రోజు దగ్గరలోనే ఉందని అభిప్రాయపడ్డారు. ఈ సదస్సులో సాధు పరిషత్ గౌరవాధ్యక్షులు అట్లూరి నారాయణరావు తీర్మానాలు ప్రవేశపెట్టారు. దేవాలయాల పైన ఇచ్చిన వివాదాస్పద జీవోను వెంటనే రద్దు చేయాలని, దేవాలయాల ట్రస్ట్ బోర్డులలో ధార్మికులను మాత్రమే నియమించాలని, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా ప్రకటించి, మద్యం, మాంసం రహితంగా చేయాలన్నారు. హిందువుల పండుగలు, ఊరేగింపులకు ప్రభుత్వం రక్షణ కలిగించాలన్నారు. గోవుని జాతీయ జంతువుగా ప్రకటించాలన్నారు. అయోధ్య, కాశీయాత్రలకు వెళ్లే భక్తులకు ఆర్థిక సహాయం చేయాలన్నారు. ప్రతి ఆలయ అర్చకుడికి గౌరవ వేతనాలు 10000 రూపాయలు ఇవ్వాలన్నారు. దేవాలయ భూముల్లో గోశాలలు ప్రతి గ్రామంలో నిర్వహించాలన్నారు. బంజరు భూములు గోశాలలోని గోవుల గడ్డి పెంచేందుకే వాడాలన్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలోనూ నూతన విద్యాలయాలు ఏర్పాటు చేయాలన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలోని ప్రతి దేవాలయము యొక్క ఆదాయ వ్యయాలు, ఆభరణల వివరాలు, భూములు, ఆస్తులు వివరాలు ఆన్లైన్లో ఉంచాలన్నారు. ఆశ్రమాల నిర్వహణకు నిధులు కేటాయించాలన్నారు.

రిజర్వేషన్ల ఆధారంగా ఉద్యోగాలు పొంది మతం మారిన వారిని ఉద్యోగాల నుంచి తొలగించాలన్నారు. 60 సంవత్సరాలు దాటిన ధార్మిక వానప్రస్థ గురువులకు వేతనాలు ఇవ్వాలన్నారు. టిటిడి స్వయంగా గోశాల నిర్వహించి ఆ గోవుల నెయ్యిని లడ్డు తయారీకి ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధికార ప్రతినిధి తురగా శ్రీరాం, ప్రముఖ గాయకులు గజల్ శ్రీనివాస్, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రవి , సాధువులు 300 మంది పాల్గొన్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న రాజధాని మెట్రో డిపిఆర్ పరిశీలిన బృందం



**విజయవాడ పశ్చిమ, జూలై 02 (మనం న్యూస్):** అమరావతి రాజధాని మెట్రో డిపిఆర్ పరిశీలించేందుకు విజయవాడ వచ్చిన పరిశీలన అధికారులు కేంద్ర ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి జయదీప్, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ రామకృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఇతర అధికారుల బృందం బుధవారం నాడు విజయవాడ ఇంద్రకీలాద్రిపైన వేంచేసి ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కోసం ఇంద్రకీలాద్రి చేరుకున్నారు. ఆలయ కార్యనిర్వహణధికారి శీనా నాయక్ ని కలిసి రాజధాని మెట్రో ప్రాజెక్ట్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఇటీవల అమ్మవారి ఆలయంలో ఈవో చేపట్టిన సంస్కరణలు గురించి తెలుసుకున్న అధికారుల బృంద సభ్యులను ఈవో శీనా నాయక్ కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## ఖడ్గ యుద్ధంలో ఆదరగొట్టిన ఏకత్వా విద్యార్థులు




**వీరులపాడు, జూలై 2(మనం న్యూస్ ):** పొన్నవరం గ్రామంలో గత సంవత్సర కాలం నుండి ఏకత్వా పాఠశాల కేంద్రంగా కోచ్ విజయ్ కుమార్ గోగులమూడి శిక్షణలో శిక్షణ పొందిన విద్యార్థులు జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీల్లోనే కాకుండా రాష్ట్ర స్థాయిలోని వివిధ విభాగాలలో జరిగిన పోటీల్లో కూడా పాల్గొని సత్తా చాటి జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ఉప ప్రధాన ఉపాధ్యాయులు ఐశ్వర్య సాంబశివన్ బుధవారం తెలిపారు. వీరు ఇటీవల విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని డిస్టిక్ స్పోర్ట్స్ అథారిటీ ఇండోర్ హాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో విజేతలుగా నిలిచి నాసిక్ పట్టణం, మహారాష్ట్రలో జరగబోయే తొమ్మిదవ జాతీయ ఫెన్సింగ్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ అమరనేని మనోజ్ పాల్గొని జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ ఫెన్సింగ్ క్రీడ అనేది ఒక పోరాట క్రీడ అని ఇటువంటి క్రీడలో తమ పాఠశాల విద్యార్థులు రాణించి విజేతలుగా నిలవడం ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. బాలికల ఆత్మరక్షణకు అండగా నిలిచే ప్రత్యేక క్రీడ ఇది. కరాటే, తైక్వాండో వంటి క్రీడల ద్వారా ఆడపిల్లలకు రక్షణ ఉంటుందని తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఇలాంటి కోవకు చెందిన ఆటే ఫెన్సింగ్ అని అన్నారు. ఈ సందర్భంగా ఎంతోమంది విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇచ్చి జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల వ్యాయామ విద్య విభాగాధిపతి విజయ్ కుమార్ గోగులమూడిని ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రతి అడుగు ప్రగతి వైపే

- **ఎమ్మెల్యే సుజనా చౌదరి ఏడాది పాలనపైన ప్రత్యేక కథనం**



**విజయవాడ పశ్చిమ, జూలై 02 (మనం న్యూస్)** కేంద్రమంత్రిగా, రాజ్యసభ సభ్యునిగా తమ సేవలందించిన సుజనా చౌదరి 2024 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేసి 47 వేల 32 ఓట్ల అత్యధిక మెజారిటీ సాధించిన విషయం తెలిసిందే. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థిగా విజయం సాధించి తొలిసారి అసెంబ్లీలో అడుగు పెట్టిన సుజనా ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తొలి ఏడాదిలోనే హామీల అమలుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. సుజనా చౌదరి ఏడాది పాలనలో పేదలకు గుదిబండలుగా మారిన విద్య ,వైద్యం మీద ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ పాఠశాలలు , ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల విషయంలో మౌలిక సదుపాయాల కల్పనకు మార్గదర్శకంగా సుజనా ఫౌండేషన్ ద్వారా బాటలు వేస్తూ ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి అని ప్రజలందరి చేత శభాష్ అనిపించుకున్నారు. పశ్చిమ పరిధిలో పేదలకు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఆపన్న హస్తాన్ని అందిస్తూ నేనున్నాననే భరోసాను సుజనా చౌదరి కల్పిస్తున్నారు. రాజకీయాలకతీతంగా పాలన అందిస్తూ పదవులకు వన్నెతెచ్చిన వ్యక్తి సుజనా చౌదరి. ఎమ్మెల్యేగా గెలుపొందిన అనతి కాలంలోనే విశేష సేవలు అందిస్తూ తనదైన ముద్ర వేసుకున్నారు. సొంత నియోజకవర్గం పశ్చిమ కోసం తన మానస పుత్రిక అయిన సుజన ఫౌండేషన్ ద్వారా ఉద్యోగమేళాలు నిర్వహిస్తూ ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. సుజనా ఫౌండేషన్ ద్వారా మెడికల్ క్యాంపులను నిర్వహిస్తూ కార్పొరేట్ వైద్యాన్ని సామాన్యులకు ఉచితంగా అందుబాటులో తీసుకొచ్చారు. ఆరోగ్య సంరక్షణలో ముందస్తు రోగ నిర్ధారణ యొక్క ప్రాముఖ్యతను గుర్తించిన ఎమ్మెల్యే సుజనా రెండు మొబైల్ మెడికల్ బస్సులను ఏర్పాటు చేసి మెరుగైన చికిత్సలను అందించడానికి సిద్ధమయ్యారు. ప్రజలకు మరింత సేవ చేయడం కోసం సుజనా మిత్రా కో- ఆర్డినేటర్లను ఏర్పాటు చేసి వారిచే సమస్యలను గుర్తించి త్వరితగతిన పరిష్కరిస్తున్నారు. శాసనసభలో సైతం సుజనా చౌదరి స్థానిక సమస్యలపైనే కాకుండా రాజధాని అమరావతి రైతుల సమస్యలపై గళం ఎత్తారు. రాష్ట్ర రాజధాని కోసం భూములిచ్చి త్యాగం చేసిన అమరావతి రైతులకు సత్వర న్యాయం జరగాలన్నారు. అమరావతిని భవిష్యత్తులో కదిలించకుండా బలీయమైన చట్టాన్ని రూపొందించాలని శాసనాభలో సుజనా చేసిన సూచనలను ఎన్డీఏ ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధమైంది. రాజధాని రైతులకు ఇప్పటివరకు జరిగిన నష్టంపై తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత వైసీపీ హయాంలో వందలాది రోజులపాటు రాజధాని ప్రాంత వాసులు, అక్కడి మహిళలు చేసిన ఉద్యమం తననెంతో కదిలించిందని శాసనసభలో సుజనా చేసిన సుదీర్ఘ ప్రసంగాన్ని రాష్ట్రమంతా ప్రశంసించింది.

## ఇంద్రకీలాద్రి పై ప్రతీ అడుగుస్థలం అమ్మ భక్తుల సేవకే చెందాలి



- **ఈవో శీనానాయక్**

**విజయవాడ పశ్చిమ, జూలై 2 (మనం న్యూస్):** ఇంద్రకీలాద్రి పై ప్రతీ అడుగుస్థలం అమ్మ భక్తుల సేవకే చెందాలని కనకదుర్గమ్మ దేవస్థానం ఇఒ శీనా నాయక్ అన్నారు. అమ్మవారి సొమ్ము వెచ్చించిన గత అధికారుల, సిబ్బంది కృషి, ఎందరో త్యాగ ఫలంతో మహా మండపం, కనక దుర్గా నగర్ ప్రాంతాలు ప్రాంతాలు దేవస్థానం అధీనం లోకి వచ్చాయని అన్నారు. ప్రతీ అడుగు నేల అమ్మవారి భక్తులకు ఉపయోగపడేలా సిబ్బంది చూడాలని ఈవో శీనా నాయక్ అన్నారు. మహా మండపం 1,2,3 వ అంతస్తుల్లో ఉపయోగించని గదులు ఉండటం, ముక్క చీరల స్టాకు ఉండటం గమనించిన ఈవో వాటిని క్లియర్ చేయాలని ఆదేశించారు. విలువైన ప్రదేశాన్ని భక్తుల వసతి నిమిత్తం వినియోగించేలా చర్యలు తీసుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంబాబు ను ఆదేశించారు. వివాహాలు జరిగే ప్రదేశాన్ని పరిశీలన చేశారు. దేవస్థానం నుండి చేస్తున్న ఏర్పాట్లు గురించి అడిగి తెలుసుకున్నారు. ఖాళీప్రదేశాలు ఉండకూడదని, మహా మండపం పూర్తి స్థాయిలో భక్తుల సేవలో వినియోగించబడాలని ఈవో ఆదేశించారు.

# రైతుల కోసం సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు

- **అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్**



**చల్లపల్లి, లక్ష్మీపురం, జూలై 2(మనం న్యూస్):** రైతులకు సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద గుండేరు మేజర్ డ్రైనేజీలో గుర్రపు డెక్క, తూటికాడ నిర్మూలనకు డ్రోన్ ద్వారా మందు స్ప్రేయింగ్ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండేరు మేజర్ డ్రైనేజీలో 19 కిమీ నుంచి 61.6కిమీ వరకూ 42.50 కిలోమీటర్ల పరిధిలో ఆపరేషన్స్ అండ్ మైంటెనెన్సు పనుల నిధులు రూ.27.27 లక్షలతో పమిడిముక్కల మండలం ఫతేలంక నుంచి చల్లపల్లి మండలం మాజేరు వరకూ ఈ పనులు చేపట్టినట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ విశేషంగా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు సబ్సిడీపై డ్రోన్లు అందిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ల వినియోగం ద్వారా వ్యవసాయ పనులు సులభతరం అవుతున్నాయన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, డ్రైనేజీ శాఖ డీఈఈ జే.బాబూ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ స్టాల్‌ను పరిశీలించిన కలెక్టర్ లక్ష్మీశ



**విజయవాడ సెంట్రల్, జూలై 02 (మనం న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర ఏ 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యా లను చేరుకునే విధంగా జిల్లాస్థాయిలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలోని ఇగ్నైట్ ప్రత్యేక సెల్లో ఏర్పాటు చేసిన పంచాయతీరాజ్ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా, డిపిఓ పి. లావణ్య కుమారి పరిశీలించారు. అనంతరం నున్న గ్రామపంచాయతీ గ్రీన్ అంబాసిడర్లకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు.

## అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ప్రజలకు తెల్పండి

- **మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు**



**విజయవాడ రూరల్, జులై 02 (మనం న్యూస్):** విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు స్థానిక నేతలతో కలిసి పాల్గొన్నారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నాలుగోవ సారి ముఖ్యమంత్రిగా తొలి ఏడాది పూర్తి చేసుకున్న చంద్రబాబు నాయుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నారన్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు ప్రజలకు వివరించేలా సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. చేసిన మేలు చేయబోయే పనులు ప్రజలకు వివరించి వారి ప్రజా విశ్వాసం పొందేలా కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సాధికార సారధుల నుండి పొలిట్ బ్యూరో సభ్యుల వరకు ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులను కోరారు. ఐదేళ్ల వైసిపి విధ్వంస పాలన నుండి కూటమి ప్రభుత్వం వచ్చాక వికాసం వైపు ఏపీ పయనిస్తుందన్నారు. సింగయ్య మరణం పై కనీస పశ్చాత్తాపం బాధ్యత లేకుండా అవినీతి పత్రిక అడ్డుపెట్టుకుని ఇంకా విషం చిమ్ముతున్నారు అని జగన్, వైసీపీ పై ధ్వజమెత్తారు. తొలి ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసిందన్నారు.

# జగ్గయ్యపేటలో మూడవ వార్డులో ఇంటింటి ప్రచారం

- **ఏడాది పాలనపై కార్యకర్తలతో సుపరి పాలనలో తొలి అడుగు సమీక్ష సమావేశం లో ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్**

**జగ్గయ్యపేట జులై 2 మనం న్యూస్:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని సుపరిపాలన అందించటమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. బుధవారం పట్టణంలోని ఎస్ వి ఎస్ కళ్యాణ మండపంలో మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు అధ్యక్షతన సుపరిపాలెం లో తొలిఅడుగు కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి నేతలు ప్రజలకు వివరించాలని తెలిపారు. మూడవ వార్డులో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ పట్టణంలోని మూడవ వార్డు పుట్టబజారులో ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అభిప్రాయాలు తెలుసుకొని కూటమి ప్రభుత్వ ఏడాది పరిపాలనపై ప్రజల నుంచి వారి అభిప్రాయాలు స్వీకరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని తక్షణమే పరిష్కారం చేయాలని ఆదేశించారు. సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ. గత ప్రభుత్వం మాటలు బారెడు, చేతలు జానెడు అనే విధంగా ప్రచారాలకే పరిమితమైందని అన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ విస్మరించి కూటమి ప్రభుత్వం పైన బురద చల్లడం సిగ్గుచేటు అన్నారు. గతంలో వైసిపి పాలకులు అమ్మ ఒడి పథకం ఎంతమందికి ఇచ్చారని ప్రశ్నించారు. మద్యపాన నిషేధం ఏమైందని, జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేయలేదన్నారు. సిపిఎస్ రద్దు చేశారా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీవెన్స్ కో కన్వీనర్ ముల్లంగి రామకృష్ణారెడ్డి, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొట్టారు సత్యనారాయణ ప్రసాద్, పట్టణ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మైనేని రాధాకృష్ణ ,నేతలు కానూరు కిషోర్ ,ధూళిపాళ్ల లక్ష్మణరావు, నియోజకవర్గ బి సి మహిళ అధ్యక్షురాలు కౌన్సిల్ సభ్యురాలు కన్నెబోయిన రామలక్ష్మి, కసుకుర్తి శ్రీనివాసరావు ,కటికల అనిల్ ,సయ్యద్ అన్వర్, బొల్లెపల్లి బోజరాజు ,షేక్ కాజా, మాజీ జడ్పిటిసి అమ్మనబోయిన రాణి ,అడుసుమిల్లి ప్రభాకర్ ,మండల సమైక్య అధ్యక్షురాలు గద్దే రాజ్యలక్ష్మి, జి నాగేశ్వరరావు ,కళ్యాణం సూర్యప్రకాష్, గంగా దారి డేవిడ్, మరియు క్లస్టర్ యూనిట్ బూత్ కన్వీనర్ కో కన్వీనర్ మరియు పట్టణంలోని వివిధ హోదాలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# కొండపల్లిలో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి




- వీలైనంత త్వరగా పర్యాటకులకు అందుబాటులోకి తేవాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, జూలై 02(మనం న్యూస్): దేశ, విదేశాలలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్న కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటిచెప్పేలా, భవిష్యత్తు తరాలకు వారసత్వ సంపదగా అందించేలా చేపట్టిన ఎక్స్పీరియన్స్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తిచేసి వీలైనంత త్వరగా పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ లక్ష్మీశ ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి మున్సిపాలిటీ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పర్యాటక, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి కొండపల్లి బొమ్మల కాలనీలోని ఎక్స్ పీరియన్స్ సెంటర్ పనులను పరిశీలించారు. కళాత్మక సౌందర్యం ఉట్టిపడేలా మ్యూరల్ పెయింటింగ్స్ పనులు పూర్తయ్యాయని, లోపల భాగంలో కొన్ని పనులు మిగిలి ఉన్నాయని అధికారులు వివరించారు. ఫెన్సింగ్ వంటి పనులను త్వరిత గతిన పూర్తిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యమున్న ఎన్టీఆర్ జిల్లాను పర్యాటక హబ్గా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామని, ఇందులో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మ విశిష్టతను పర్యాటకులకు చాటి చెప్పేలా ఎక్స్ పీరియన్స్ సెంటర్ను అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కొండపల్లి బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్ల పొణికి చెక్క ప్రాచుర్యాన్ని, బొమ్మలకు సంబంధించిన విశేషాలను పర్యాటకులకు కళ్లకు కట్టినట్లుగా తెలియజేసి ప్రత్యక్ష అనుభూతి పొందేలా ఎక్స్ పీరియన్స్ సెంటర్ ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. కలెక్టర్ వెంట విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మునిసిపల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు ఉన్నారు.

# కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రగతికి ఆశా కిరణమైంది

- అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్
- రూ.2.40 కోట్లతో పూషడం, మల్లాయి చిట్టూరు తారు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



ఘంటసాల, జూలై 2(మనంన్యూస్): వైసీపీ పాలనతో రాష్ట్రం అస్తవ్యస్తంగా ఉన్న సమయంలో పవన్ కళ్యాణ్ చొరవతో ఏర్పడిన ఎన్.డీ.ఏ కూటమి రాష్ట్ర ప్రగతికి ఆశా కిరణమైందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం ఘంటసాల మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.2.40 కోట్లతో రెండు తారు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ శంకుస్థాపనలు చేశారు. రూ.కోటీ నలభై లక్షలతో జాతీయ రహదారి-216 నుంచి పూషడం వరకూ మూడు కిలోమీటర్ల తారు రోడ్డు, రూ.కోటితో పూషడం నుంచి మల్లాయి చిట్టూరు వరకూ రెండు కిలోమీటర్ల తారు రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సహకారం లేకపోతే ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని పరిస్థితి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సంపూర్ణ సహకారం ఉండటంతో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. పూషడం, మల్లాయి చిట్టూరు రోడ్ల పునర్ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించినట్లు తెలిపారు. తద్వారా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమం ద్వారా మంజూరు చేసిన రూ.32.24 కోట్లతో నియోజకవర్గంలో 56 కిలోమీటర్ల మేర అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు.గత ప్రభుత్వం రైతులను ఆఫ్ లైన్, ఆన్లైన్ పేరుతో ఇబ్బంది పెట్టడమే కాకుండా ధాన్యం సొమ్ము రూ.1,600 కోట్లు బకాయి పెట్టి పోతే తమ కూటమి ప్రభుత్వం తీర్చిందన్నారు. తమ ప్రభుత్వం 48 గంటల్లో ధాన్యం సొమ్ము జమ చేస్తామని చెప్పి 24 గంటల్లోనే చెల్లించినట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం ద్వారా పిల్లలను బడికి పంపే పేద తల్లిదండ్రులకు మేలు కలిగిందన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజలు మాట్లాడుతూ తమ ప్రధాన రహదారి సమస్య పరిష్కారం చేసిన ఎమ్మెల్యేకు బుద్ధప్రసాదుకు ధన్యవాదములు తెలిపారు.

# ఏడాది పాలనలో అభివృద్ధి లక్ష్యంగా అడుగులు, 140 సంక్షేమ పథకాల అమలు



- సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరిలో దేశం నేతల ఇంటింటి ప్రచారం
- ఇంటింటి ప్రచారం లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం

జగ్గయ్యపేట జులై 2 (మనం న్యూస్): గత సంవత్సర కాలంలో ప్రజలు మెచ్చే పాలన అందించినట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కే డి సి సి బ్యాంక్ చైర్మన్ ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ,మాజీమంత్రి నెట్టెం రఘురామ్ , నియోజకవర్గ పరిశీలకులు దొంతు చిన్న లు ఇంటింటి ప్రచారంలో తెలిపారు. సు పరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తిరుమలగిరిలో నేతలు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ ఏడాది కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి కరపత్రాలను అందించారు. సందర్భంగా జగ్గయ్యపేట మండలం తిరుమలగిరి గ్రామంలో వేంచేసి యున్న శ్రీ వల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కొఠారు సత్యనారాయణ ప్రసాద్, జగ్గయ్యపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, తిరుమలగిరి దేవస్థాన మాజీ చైర్మన్ దర్శి విజయ నరసింహారావు, దేవస్థాన మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ పసుపులేటి శ్రీనివాసరావు, క్లస్టర్ అడుసుమల్లి ప్రభాకర్, గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండు కిషోర్, గుమ్మ మధు, గుమ్మ వెంకటేష్, యామర్తి బోస్ యాదవ్, ఇమ్మడి వెంకటేశ్వరరావు, గుడారు నాగర్జున, కరిసే సాలమన్ రాజు, కరిసే రవి, బొప్పాల మనోజ్, ఎనికె గోపి, ఆళ్లూరి రమణ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ రిజిస్ట్రేషన్ పై తహసీల్దార్ విచారణ



మంత్రాలయం,జూలై 2, మనం న్యూస్ : మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన కడతట్ల వెంకటలక్ష్మి కి చెందిన పొలంను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ విషయం పై గత నెల 27 తేదిన మంత్రాలయం తహసిల్దార్ రమాదేవి కి విచారణ జరిపి న్యాయం చేయాలని వినతి పత్రం అందించారు. విచారణలో భాగంగా బుధవారం రచ్చుమర్రి లో తహసీల్దార్ రమాదేవి, ఆర్ ఐ జనార్ధన్ రావు , మండల సర్వేయర్ అశోక్ కుమార్ లు రిజిస్టర్డ్ డాక్యుమెంట్ నంబరు 90/2004 ద్వారా సర్వే నంబరు 451/అ1 లో 0.42 సెంట్ల భూమి పై ఇరువర్గాల కడతట్ల వెంకటలక్ష్మి, మజ్జిగ రామదాసు ల పొలం పత్రాలు పరిశీలించారు. ఇందులో మజ్జిగ రామదాసు పొలం పత్రాలలో రామదాసు పేరు కాకుండా వేరే వారి పేరు ఉండడంతో నీకు పొలం ఎటువంటి సంబంధం లేదని తహసీల్దార్ రమాదేవి సూచించారు. కడతట్ల వెంకటలక్ష్మి పత్రాలు సక్రమంగా ఉన్నాయని ఆమె తెలిపారు. విచారణ జరిపి నివేదిక తయారు చేయాలని ఆర్ ఐ జనార్ధన్ రావు, మండల సర్వేయర్ అశోక్ లను ఆదేశించారు. వీరు ఇచ్చిన నివేదిక ను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కు పంపడం జరుగుతుందని తెలిపారు. సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ విచారణలో వీఆర్వో రంగస్వామి, రైతు కడతట్ల నరసింహులు, చుట్టు పక్కల రైతులు ఉన్నారు.

# రాష్ట్రంలో సుపరిపాలన.. తొలి అడుగులో అభివృద్ధి



- రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్

కౌతాళం, జూలై 2(మనం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు, కౌతాళ మండలం వల్లూరు గ్రామంలో రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, చంద్రబాబు నాయుడు అందించిన తల్లికి వందనం, దీపం పథకం,యువతకు ఉపాధ్యాయ పోస్టులు, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, పథకాలను ప్రజలకు వివరించి, రాబోయే రోజులలో చేపట్టబోయే అభివృద్ధి పథకాల గురించి తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## కౌతాళం మండల ప్రజలు మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి



- సీఐ అశోక్ కుమార్

కౌతాళం,జులై 02 మనం న్యూస్: కౌతాళం మండలంలోని గ్రామాలలోని ప్రజలందరూ మొహరం పండుగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సిఐ అశోక్ కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పండుగను అందరూ కలిసి ఐక్యమత్యంతో జరుపుకోవాలన్నారు.ఎవరైనా గ్రామాల్లో అల్లర్లకు సృష్టిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. చిన్న చిన్న గొడవలకు పోయి మీ జీవితాలు,భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని తెలిపారు. ప్రజలందరూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

# సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



- సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు.

తుగ్గలి జులై 2(మనం న్యూస్ ): ప్రజా సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర,మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు,టీడీపీ మండల అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు. బుధవారం ''సుపరిపాలన లో తొలిఅడుగు-ఇంటింటికి తెలుగుదేశం'' కార్యక్రమంలో భాగంగా తుగ్గలి మండల పరిధిలోని రాంపురం గ్రామంలో పర్యటించారు. సుపరిపాలనలో తొలిఅడుగు కరపత్రికలను ఇంటింటికి వెళ్లి సంవత్సరం కాలంలో కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులను, ప్రజల సంక్షేమం-అభివృద్ధి కోసం వేసిన ప్రతి అడుగును ఇంటింటికి వెళ్లి ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు వివరించారు.భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాలను కూడా చెప్పే విధంగా ఈ ప్రచారం కొనసాగుతుంది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాంపురం గ్రామంలో ఇంటింటికి వెళ్ళగా కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో మాకు పలు సంక్షేమ పథకాలు ద్వారా ఎంతో మేలు జరిగిందని ప్రజలు చెప్పడం ఎంతో సంతృప్తిని,ఆనందాన్ని కలిగించిందని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్ర,మాజీ ఎంపీపీ కొమ్ము వెంకటేష్,మాజీ సర్పంచ్ వెంకటస్వామి,మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాసులు గౌడ్,శివ రాముడు,కొత్తూరు చక్రపాణి,రఫీ,సత్య ప్రకాష్,సంఘాల కృష్ణ,మైరాముడు,ఫీల్ అసిస్టెంట్ ఇస్మాయిల్, శివ,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# బ్రిక్స్ సదస్సుకు జిన్పింగ్ దూరం

బ్రెసిలియా, జూలై 2 : బ్రెజిల్లో ఈ వారం జరగనున్న బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు జిన్పింగ్ హాజరుకావడం లేదు. ప్రీమియర్ (ప్రధాని) లీ కియాంగ్ ఈ సదస్సుకు హాజరుకానున్నట్లు చైనా అధికారికంగా వెల్లడించింది. జిన్‌పింగ్ అధికారం చేపట్టిన 12 ఏళ్లలో తొలిసారి ఈ సదస్సుకు దూరంగా ఉండటం గమనార్హం. మరోవైపు అధ్యక్షుడు ఇటీవల కొంతకాలం అదృశ్యమయ్యారన్న వార్తల వేళ ఈ కీలక ప్రకటన వెలువడింది.

బ్రెజిల్లోని రియోడి జనీరోలో జులై 5 నుంచి 8 వరకు బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరగనుంది. భారత ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఈ సదస్సుకు హాజరుకానున్నారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పడిన ఈ కూటమిలో ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలు ఆ తర్వాత చేరిన సంగతి



తెలిసిందే. రష్యాలోని కజాన్లో గతేడాది జరిగిన సదస్సులో భారత ప్రధాని మోడీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు భేటీ అయ్యారు.

ఇరుదేశాల మధ్య సరిహద్దు వివాదం నెలకొన్న ఆ సమయంలో నాలుగేళ్ల విరామం తర్వాత ఇద్దరు నేతలు సమావేశం కావడం అప్పట్లో ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాకుండా పలు ద్వైపాక్షిక అంశాలపైనా ఓ అంగీకారానికి రావడంతో ఇరుదేశాల మధ్య సంబంధాలు కాస్త మెరుగుపడ్డాయి. తాజాగా ఇదే సదస్సుకు జిన్‌పింగ్ దూరమవుతున్న నేపథ్యంలో తదుపరి వీరిద్దరు ఈ ఏడాది చివరలో చైనాలో జరిగే ఎస్సీవో సదస్సులోనే భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

మరోవైపు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్.. మే 21 నుంచి జూన్ 5 వరకూ అదృశ్యమయ్యారన్న వార్త ఇటీవల కలకలం రేపింది. అధ్యక్ష మార్పునకు ఇది సంకేతమంటూ కొన్ని నిఘా సంస్థలు అంచనా వేసినట్లు వార్తలు వచ్చాయి. సంస్కరణాభిలాషి, టెక్నోక్రాట్ అయిన వాంగ్ యాంగ్ తదుపరి అధ్యక్షుడు కావొచ్చంటూ ఊహాగానాలు వినిపించాయి. అయితే జిన్‌పింగ్ ఇలా అదృశ్యం కావడం సాధారణమేనని, సమయం వస్తే అధినేతలనైనా చైనా కమ్యూనిస్టు పార్టీ పక్కనబెట్టడం రివాజేనని నిఘా సంస్థలు పేర్కొన్నాయి.

# డోజ్ రాక్షసి లాంటిది.. మస్క్ను తినేస్తుంది: ట్రంప్

వాషింగ్టన్, జూలై 2: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ట్రంప్ కలల బిల్లు 'బిగ్ బ్యూటిఫుల్'ను మస్క్ మొదటి నుంచి వ్యతిరేకిస్తుండటంతో మరోసారి వీరి మధ్య విభేదాలు మొదలైన విషయం తెలిసిందే.

ప్రపంచంలోని ఏ వ్యక్తికి దక్కనన్ని సబ్సిడీలు మస్కుకు దక్కుతున్నాయని.. ఈ సబ్సిడీలు లేకపోతే ఆయన దుకాణం మూసేసుకుని వెళ్లిపోవాల్సిందేనని ట్రంప్ ఇటీవల వ్యాఖ్యానించారు. రాకెట్ ప్రయోగాలు, శాటిలైట్లు, విద్యుత్తు కార్ల ఉత్పత్తి లేకపోతే దేశానికి ఎంతో మిగులుతుందని, దీనిపై చర్యలు తీసుకోవడానికి డోజ్ ఉందన్నారు. ''డోజ్ మస్క్ వైపు చూస్తుందని నేను అనుకుంటున్నాను. ఒకవేళ డోజ్ మస్క్ వైపు చూస్తే.. మనం చాలా డబ్బు ఆదా చేసుకోవచ్చు'' అని ఫ్లోరిడా పర్యటనలో ట్రంప్ అన్నారు. 'మస్క్‌పై డోజ్‌ను ప్రయోగించాల్సి రావొచ్చు. డోజ్ అంటే ఏమిటో మీకు తెలుసు కదా..? డోజ్ రాక్షసి లాంటిది. అది తిరిగి వెళ్లి ఎలాన్ మస్కును తింటుంది. అది ఎంతో భయంకరమైనది'' అని ట్రంప్ మీడియాతో పేర్కొన్నారు. ఇక 'బిగ్ బ్యూటిఫుల్'బిల్లు ఇటీవల సెనెట్లో ఆమోదం పొందింది. దీనిపై మరోసారి సెనెట్లో ఓటింగ్ జరగనుండగా మస్క్ వరుస పోస్టులతో విరుచుకుపడ్డారు. ఆ బిల్లుకు ఓటు వేసే కాంగ్రెస్ సభ్యుల సీట్లకు వచ్చే ఏడాది ఎసరు పెట్టేందుకు పని చేస్తానని హెచ్చరించారు. ప్రభుత్వ వ్యయాలు తగ్గిస్తామని చెప్పి.. ఇప్పుడు ఓటు వేస్తే తలవంచుకొని సిగ్గు పడాల్సి వస్తోందన్నారు. తన కొత్త పార్టీ గురించి కూడా ఆయన ప్రస్తావించారు. ఈ క్రమంలోనే మస్కును దేశం నుంచి బహిష్కరించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు.

# భారత్ 'బఫరింగ్ శకం' కాంగ్రెస్‌తోనే ముగిసింది

## ఖర్గేకు కేంద్ర మంత్రి జ్యోతిరాధిత్య సింధియా కౌంటర్

ఢిల్లీ, జూలై 2 : ప్రధాని నరేంద్రమోదీ హయాంలో డిజిటల్ ఇండియా అంటే నెరవేర్చని హామీలేనని కాంగ్రెస్ చేసిన విమర్శలను కేంద్ర టెలికాం మంత్రి జ్యోతిరాధిత్య సింధియా తిప్పికొట్టారు. భారత్‌లో 'బఫరింగ్ యుగం' కాంగ్రెస్‌తోనే ముగిసిపోయిందని.. ప్రధాని మోడీ పాలనలో దేశం 5జీ వేగంతో వెళ్తోందని అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడికి జ్ఞానోదయం కలిగించే మరో అవకాశం తమకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో కాంగ్రెస్ నేతలు తమను ప్రశ్నించిన ప్రతిసారీ తగిన ఆధారాలతో జవాబు చెప్పామని పేర్కొన్నారు. దేశ ప్రజలకు కాంగ్రెస్ డయల్-అప్ సౌకర్యం కూడా అందించలేక పోయిందన్నారు. కానీ తమ ప్రభుత్వం ప్రపంచస్థాయి టెలికాం నెట్‌వర్క్, యూపీఐ, భారత్ నెట్ వంటి సేవలను దేశ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు.

దాదాపు 18 ఏళ్ల తర్వాత ప్రభుత్వరంగ టెలికాం సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ వరుసగా లాభాలు ఆర్జించడం, రెండు లక్షలకు పైగా గ్రామ పంచాయతీలను బ్రాడ్‌బ్యాండ్‌తో అనుసంధానించడం వంటి విషయాలను సింధియా ఉదహరించారు. యూపీఐ వంటి వేదికల వల్ల ప్రపంచ డిజిటల్ లావాదేవీల్లో సగం మన దేశంలోనే జరుగుతున్నాయని.. వ్యాపారాల్లో దళారుల ప్రమేయాన్ని తొలగించి ప్రత్యక్ష నగదు బదిలీ చేయడం వల్ల రూ.3.48 లక్షల కోట్ల డబ్బు ఆదా అవుతోందని అన్నారు.

'డిజిటల్ ఇండియా' కార్యక్రమం చేపట్టి మంగళవారానికి సరిగ్గా పదేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. తమ పాలనలో దేశాన్ని సాంకేతికత వైపు నడుపుతున్నామని అన్నారు. భారతీయులు సాంకేతికతను వాడగలరా, లేదా అనే సందేహంతోనే దశాబ్దాలు గడిచిపోయాయని.. తమ ప్రభుత్వం వచ్చాక ఈ ధోరణిని మార్చిందని అన్నారు. ప్రస్తుతం దేశంలో 97 కోట్ల ఇంటర్నెట్ కనెక్షన్లు ఉన్నాయన్నారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ.. ప్రభుత్వం ఎన్ని గొప్పలు చెప్పినా అవన్నీ శుష్క వాగ్దానాలుగానే మిగిలాయని 65% గ్రామాలకు ఇంకా బ్రాడ్‌బ్యాండ్ అందుబాటులోకి రాలేదని, ప్రభుత్వరంగ టెలికాం కంపెనీల రుణభారం పెరిగిపోతోందని, సైబర్ నేరాలకు అంతే లేదని పేర్కొన్నారు.

# 11వ తరగతి విద్యార్థిపై లైంగిక వేధింపులు

- పోక్సో చట్టం కింద మహిళా టీచర్ అరెస్టు

ముంబయి, జూలై 2 : ముంబయి లోని ప్రముఖ పాఠశాలలో 11వ తరగతి చదువుతున్న విద్యార్థిపై ఓ మహిళా టీచర్ లైంగిక వేధింపులకు పాల్పడింది. దీంతో ఆమెను పోక్సో చట్టం కింద పోలీసులు అరెస్టు చేశారు. టీచర్ ప్రవర్తనపై బాధిత విద్యార్థి తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 2023లో పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా గ్రూప్ డ్యాన్స్ కోసం సిద్ధం చేస్తున్న సమయంలో బాధిత విద్యార్థితో ఆ టీచర్ పరిచయం పెంచుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత అతడిని ఆమె పలు ఫైవ్‌స్టార్ హోటళ్లకు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. తొలుత ఆ విద్యార్థి నిరాకరించినప్పటికీ.. మరో మహిళ సాయంతో ఆ బాలుడిని టీచర్ ఒప్పించినట్లు సమాచారం. టీచర్లు-విద్యార్థుల మధ్య ఇలాంటివి సహజమేనని ఆమె చెప్పి బాలుడిని ఒప్పించింది. దీంతో అతడు టీచర్‌ను కలిసేందుకు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఆ మహిళపై కూడా కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

ఆ తర్వాత టీచర్.. ఆ విద్యార్థిని కారులో నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకెళ్లిందని పోలీసులు చెప్పారు. అతడితో మద్యం కూడా తాగించేదని పేర్కొన్నారు. ఆ తర్వాత కొన్ని రోజులకు ఆ విద్యార్థి తీవ్ర ఆందోళనకు గురయ్యేవాడని.. ఆందోళన తగ్గేందుకు టీచర్ మందులు కూడా ఇచ్చేదని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం.

ఆ తర్వాత తమ కుమారుడి ప్రవర్తనలో మార్పును గమనించి తల్లిదండ్రులు ఆరాతీశారు. దీంతో జరిగిన విషయాన్ని అతడు తల్లిదండ్రులకు వివరించాడు. అయితే.. మొదట్లో దీనిపై ఫిర్యాదు చేయకూడదని తల్లిదండ్రులు నిర్ణయించుకున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మైక్రోసాఫ్ట్‌లో భారీగా లేఆఫ్‌లు.. 9 వేల మందికి నోటీసులు!

వాషింగ్టన్, జూలై 2 : టెక్ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్ మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగులను తొలగించేందుకు సిద్ధమైంది. వేలాది మందికి లేఆఫ్ నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. కొన్ని నెలల వ్యవధిలోనే ఈ స్థాయి లేఆఫ్‌లు ప్రకటించడం ఇది రెండోసారి. అయితే, ఈసారి ఎంతమందిపై వేటు




పడనుందనే విషయాన్ని స్పష్టంగా చెప్పనప్పటికీ.. దాదాపు నాలుగు శాతం కంటే తక్కువ ఉద్యోగులపై ప్రభావం చూపనుందని తెలిపింది. కొన్ని మీడియా కథనాల ప్రకారం దాదాపు 9 వేల మందికి లేఆఫ్లు ఇచ్చినట్లు సమాచారం. జూన్ 2024 నాటికి 2.28 లక్షల మంది ఉద్యోగులు మైక్రోసాఫ్ట్లో పనిచేస్తున్నారు. భారీ సంఖ్యలో ఉద్యోగుల తొలగింపులను మొదలుపెట్టిన టెక్ దిగ్గజం.. ఈ ఏడాది మే నెలలో 6 వేల మందికి లేఆఫ్‌లు ప్రకటించింది. తాజాగా మరోసారి పెద్దఎత్తున తొలగింపునకు సిద్ధమైంది. తాజా నిర్ణయంతో మొత్తం సిబ్బందిలో నాలుగు శాతం.. అంటే దాదాపు 9100 మంది ఉద్యోగులపై ప్రభావం పడనున్నట్లు అంచనా.

# నాకు ఇంకో దారి లేదు: 'సీఎం పదవి'పై డీకే ఆసక్తికర వ్యాఖ్యలు

బెంగళూరు,జూలై 2 : కర్ణాటకలో నాయకత్వ మార్పు అంశంపై కొన్ని రోజులుగా వినిపిస్తోన్న వ్యాఖ్యలకు చెక్ పడింది. ఐదేళ్లు తానే కర్ణాటక ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య స్పష్టంచేశారు. 'నేను సీఎంగా కొనసాగుతా. మీకెందుకు అలాంటి అనుమానాలు ఉన్నాయి..?' అని బుధవారం పాత్రికేయులకు వెల్లడించారు. సీఎం మార్పు గురించి విపక్ష పార్టీలు బీజేపీ, జేడీఎస్ చేస్తోన్న వ్యాఖ్యలను కొట్టిపారేశారు. వారేమైనా కాంగ్రెస్ అధిష్ఠానమా అని ప్రశ్నించారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మాట్లాడుతూ..' ఆయన(సీఎం)కు అండగా ఉండటం తప్ప నాకు ఇంకో ఆప్షన్ లేదు. నేను ఆయనకు మద్దతు ఇవ్వాలి. అధిష్ఠానం ఏం చెబితే అది చేయాలి'' అని మాట్లాడారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి పదవిపై రాష్ట్ర కాంగ్రెస్లో తీవ్ర స్థాయిలో చర్చ జరిగింది. సిద్ధరామయ్య, డీకే శివకుమార్లు రెండున్నరేళ్ల పాటు పదవిలో కొనసాగేలా అంగీకారానికి వచ్చారనే వార్తలూ వచ్చాయి. పలు కేసుల్లో సిద్ధరామయ్య పేరు బయటకు రావడంతో సీఎంగా ఆయనను తొలగించాలన్న డిమాండ్లు తెర పైకి వస్తున్నాయి. శివకుమార్ కూడా ఎప్పటికైనా ముఖ్యమంత్రి పదవిని స్వీకరిస్తాననే బహిరంగంగానే చెబుతున్నారు. ఆ నేపథ్యమూ ఈ చర్చకు దారితీసింది. అయితే వ్యాఖ్యలను డీకే శివకుమార్, కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ రణదీప్ సూర్జేవాలా ఇప్పటికే ఖండించిన సంగతి తెలిసిందే. 'నా తరఫున ఎమ్మెల్యేలు మాట్లాడాలని కోరుకోవడం లేదు. 2028లో రాష్ట్రంలో జరిగే ఎన్నికల పైనే నేతల దృష్టి ఉండాలి. నేను తొలుత పార్టీ కార్యకర్తను. అన్నింటికంటే పార్టీనే ముఖ్యం' అని డీకే స్పష్టంచేశారు. రాష్ట్రంలో నాయకత్వ మార్పు లేదని సూర్జేవాలా వెల్లడించారు.

# ఉపాధి శ్రామికుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా వ్యాకాస

- జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని చేస్తున్న శ్రామికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని
- ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం కర్ణ



**జూపాడు బంగ్లా, జులై 2 (మనం న్యూస్) :** జూపాడు బంగ్లా మండలం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం రోజు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి సంఘం నాయకులు వి. శ్రీనివాసులు,అధ్యక్షత వహించారు .ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎం. కర్ణ .హాజరై ఆయన మాట్లాడుతూ. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలకు బడుగు బలహీన వర్గాలకు ఒక వరం లాంటిదని వాటినీ పేదలకు దూరం చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం నిధులు తగ్గిస్తూ పని చేసిన ఉపాధి శ్రామికులకు సకాలంలో బిల్లులు మంజూరు చేయకపోవడంతో పనుల దగ్గర మౌలిక వసతులు కల్పించకపోవడం రెండు ఫోటోల విధానం తీసుకురావడం.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కుట్రలో భాగమని ఆయన మండిపడ్డారు. తక్షణమే పెండింగులో ఉన్న బిల్లులు మంజూరు చేయాలని పనుల దగ్గ మౌలిక సదుపాయాలు కల్పించాని రెండు వారాల బిల్లులు డిలీట్ అయిన వాటిని వెంటనే పని చేసిన శ్రామికుల అందరికీ జమ చేయాలని పనిముట్లు ఇవ్వాలని నిత్యవసర ధరలు పెట్రోల్ డీజిల్ గ్యాస్ విద్య వైద్యంలో ఖర్చులు విపరీతంగా పెరగడంతో కష్టజీవుల కడుపు నింపేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి శ్రామికులకు రోజు వేతనం 600 ఇవ్వాలని వ్యవసాయ పనులు తగ్గిపోవడంతో జాబు కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 2 వందల రోజులు పని దినాలు కల్పించాలని ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబానికీ 10 లక్షలు ఎక్స్రేషియా ఇవ్వాలని తదితర అంశాలపై ఎంపీడీవో గోపికృష్ణ గారికి వినత పత్రం సమర్పించారు వెంటనె ఆయన స్పందించి పనులు అడిగిన వారందరికీ పనులు చూపిస్తామని టెక్నికల్ సమస్య వల్ల రెండు వారాల బిల్లులు డిలే జరిగిందని వాటినీ ఈరోజే పరిష్కరిస్తానని తదితర అంశాలు ప్రభుత్వం దృష్టికి పంపుతామని ఆయన తెలిపారు. అనంతరం సిఐటియు నాయకులు ఆకుల రాము మాట్లాడుతూ. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోనేందుకు తమరు క్రింది స్థాయి అధికారులకు తగిన సూచనలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దేవరాజు. సిఐటియు నాయకులు కే శివ .మణికంఠ ఆచార్య. ఉపాధి శ్రామికులు సూరి. వెంకటరమణ సుబ్బరాయుడు ఆంజనేయులు శేఖర్ .సుజాత .రమణమ్మ .అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# హంద్రీనీవా ప్రధాన కాలువకు సబ్ కెనాల్ ఏర్పాటు చేయాలి



**దేవనకొండ, జులై 2(మనంప్రతినిధి ) :** హంద్రీనీవా ప్రధాన కాలువకు గుండ్లకొండ వద్ద సబ్ కెనాల్ ఏర్పాటు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శిలు మద్దిలేటి శెట్టి, మండల కార్యదర్శి, నరసరావు లు పేర్కొన్నారు. బుధవారం ఏపీ రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... 46వేల ఎకరాలకు ఆయకట్టుకు సాగునీరు అందించే లక్ష్యంగా ప్రభుత్వం ఉందన్నారు. ఈ కాలం ద్వారా కొన్ని తిరుమల రైతులకు మాత్రమే సాగునీరు అందుతుందన్నారు. 75% రైతులకు అందరిని ద్వారా సాగునీరు అందడం లేదన్నారు. రైతులకు సాగునీరు అందించాలంటే గుండ్లకొండ వద్ద సబ్ కెనాల్ ఏర్పాటు చేసి గుడిమిరాళ్ల, వెంకటాపురం, మాదాపురం, బంటుపల్లి గ్రామాలకు సాగునీరు అందించాలన్నారు. ఇప్పటివరకు హంద్రీనీవా సాగునీటికి నోచుకోని మిగులు గ్రామాలకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బజారి, ఆంజనేయులు, భాస్కర్, వీరాంజనేయులు, సుబ్బయ్య శెట్టి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటి అవగాహనే..రేపటి భద్రతకు ఆధారం

- అక్రమాల నుంచి భవిష్యత్తును కాపాడే సూచనలు
- యువతను చట్టపరంగా చైతన్యం చేయడానికి పోలీసులు ముందంజ
- సమాజ నిర్మాణానికి శాస్త్రసమ్మతమైన ఆచరణ
- అక్షర శ్రీ కాలేజీలో ఈవ్టీజింగ్, యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు'




**ఆదోని, జులై 2(మనం న్యూస్) :** కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆదోని డీఎస్పీ మర్రిపాటి హేమలత పర్యవేక్షణలో, ఆదోని ట్రాఫిక్ సిఐ గంట సుబ్బారావు ఆధ్వరంలో అక్షర శ్రీ జూనియర్ కళాశాల, ఆదోని లో ఈవ్ టీజింగ్, యాంటీ ర్యాగింగ్, సైబర్ నేరాలు మరియు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి నేరాలలో భాగస్వాములు కాకూడదని, ఇది శిక్షార్హమైన నేరమని స్పష్టంగా తెలియజేశారు. విద్యార్థులు గంజాయి, సిగరెట్లు, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఈవ్ టీజింగ్ లాంటి చెడు అలవాట్లు మీ భవిష్యత్తును నాశనం చేస్తాయని హెచ్చరించారు. సైబర్ నేరాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వేదికల వాడకంలో జాగ్రత్తలు పాటించాలని వివరించారు. ట్రాఫిక్ నిబంధనల పాటన వల్లే ప్రాణాలు కాపాడుకోవచ్చని, హెల్మెట్, సీటుబెల్ట్ వంటి భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మీ బంగారు భవిష్యత్తుకు చదువే పునాది అని అధికారులు పేర్కొంటూ, చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని సూచించారు. విద్యార్థుల్లో చట్టపట్ల అవగాహన పెంపొందించే దిశగా ఈ సదస్సు ఎంతో ఉపయుక్తంగా నిలిచిందన్నారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, స్కూల్ కళాశాల యాజమాన్యులు పాల్గొన్నారు.

# 14వ మహాసభలను జయప్రదం చేయండి




## మహాసభల కరపత్రాలు ఆవిష్కరించిన సిపిఐ నాయకులు

**పత్తికొండ, జులై 2(మనం న్యూస్ ) :** ఈనెల 12 న పత్తికొండలో జరిగే సిపిఐ నియోజకవర్గ 14 వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి ఎన్. రామాంజనేయులు,తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, జిల్లా సమితి సభ్యులు ఆర్. గురుదాస్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెనుకబడ్డ పత్తికొండ నియోజకవర్గం లో పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సిపిఐ అలుపెరగని పోరాటాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇళ్ల స్థలాలు లేని నిరుపేదలకు భూ పోరాటం ద్వారా ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈనెల 12న జరిగే నియోజకవర్గ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య లు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని వారు తెలిపారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు నాగిరెడ్డి, మాదన్న, నాగరాజు, ఓబులేసు,ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

## మొహరం పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి

**మహానంది, జులై 2 (మనంన్యూస్) :** మహానంది మండలంలోని గ్రామాలలోని ప్రజలందరూ మొహరం పండుగ వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పండుగను అందరూ కలిసి ఐక్యమత్యంతో



జరుపుకోవాలన్నారు. ఎవరైనా గ్రామాల్లో అల్లర్లకు సృష్టిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. చిన్న చిన్న గొడవలకు పోయి మీ జీవితాలు,భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులదేనని తెలిపారు. ప్రజలందరూ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు.

# మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుటుంబ సభ్యులకు ఘన సన్మానం



- వైసిపి రైతు విభాగపు జిల్లా ఉపాధ్యక్షులు రామాంజనేయులు యాదవ్

**తుగ్గలి జులై 2(మనం న్యూస్) :** మండల కేంద్రమైన తుగ్గలి లోనే మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి కుమారుడు, వైఎస్ఆర్సిపి రైతు విభాగపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుగ్గలి శ్రీనివాసులు రెడ్డి ను, వైసిపి జిల్లా మాజీ సేవాదళ్ కార్యదర్శి తుగ్గలి మోహన్ రెడ్డి ను, వైసిపి ఐటి అధ్యక్షులు తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి ల ను బుధవారం మాజీ ఎంపీపీ సలహాదారుడు, వైసిపి రైతు విభాగపు జిల్లా ఉపాధ్యక్షులు అమీనాబాద్ గ్రామానికి చెందిన ఎంబాయ్ రామాంజనేయులు యాదవ్ తుగ్గలి లో మాజీ ఎమ్మెల్యే తమ్మారెడ్డి నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల రామాంజనేయులు యాదవ్ కు వైసిపి రైతు జిల్లా విభాగపు జిల్లా ఉపాధ్యక్షుడు పదవి రావడం జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు యాదవ్ మాట్లాడుతూ తనకు పదవి రావడానికి సహకరించిన వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్ వి మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీ దేవమ్మ ,తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి ,తుగ్గలి మోహన్ రెడ్డి, తుగ్గలి చంద్రశేఖర్ రెడ్డి పార్టీ మండల కన్వీనర్ అట్ల గోపాల్ రెడ్డి, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షులు నగేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఎర్రగుడి రామచంద్రారెడ్డి, పగిడిరాయి జగనాథ్ రెడ్డి, రాతన మోహన్ రెడ్డి, గిరి గేట్ల పని భూషణ్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి మండల వైసిపి నాయకులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని రామాంజనేయులు యాదవ్ పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభివృద్ధిని పట్టించుకోవడంలేదని, అందువల్ల రైతుల పక్షాన నిలబడి రైతుల అభివృద్ధి కోసం వైఎస్ఆర్సిపి నాయకులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేసినందుకు సిద్ధంగా ఉన్నామని అయన తెలిపారు.

# సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న తెదేపా నాయకులు

**కౌతాళం, జూలై 2 మనం న్యూస్ :** రాష్ట్ర కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన కార్యక్రమములో బుధవారం రోజున కౌతాళం మండల పరిధిలోనే గోతులదొడ్డి,తోవి, కామవరం గ్రామములో చేపట్టడం జరిగింది.ఈ కార్యక్రమములో పాల్గొని ప్రతి ఇంటికి వెళ్ళి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమలు అందిస్తున్న తీరును వారిని అడిగి తెలుసుకోవడం జరిగింది.ప్రతి ఇంటి వద్ద వెళ్ళినప్పుడు ప్రతి మహిళా కళ్ళలో ఆనందం వెదజల్లుతుంది ,ప్రతి ఒక్కరు సంతోషాన్ని వ్యక్త పరుస్తున్నారని తెలియజేశారు.కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళలో ఇచ్చిన హామీలు దశల వారీగా 100శాతం సంక్షేమం



అందిస్తున్నామని,దాదాపు 70శాతం హామీలు అమలు చేస్తున్నామని రాబోయే రోజుల్లో అన్నదాత సుఖీభవ, తల్లీబిడ్డ నిధి,విద్యార్థులకు నిరుద్యోగ భృతి ఇస్తామని వచ్చేలా నెలలో ప్రతి మహిళకు ఉచిత ప్రయాణ బస్సు సౌకర్యం కల్పిస్తామని తెలియజేశాము. గత ప్రభుత్వం రాష్ట్రములో ఉన్న వనరులను నాశనం చేశారని, ఆపద్దాలను నిజం చెయ్యాలని చూస్తున్నారని,ప్రజలు ఎవరు నమ్మే పరిస్థితిలో లేరని ఆది వైసీపీ నాయకులు తెలుసుకోవాలని, రాఘవేంద్ర రెడ్డి సారథ్యంలో మరింత అభివృద్ధి చేసి ప్రజల వద్దకు వెళ్తామని తెలిపడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు శంకర్, సోమనాథ్,గణేశ్, లక్ష్మణ్, ఈరన్న, తిక్కయ్య, నభి సాబ్,రామలింగ, జాకీర్, మర్రిస్వామి, అనుమేష్, లక్కే గోవిందు,శివ చూడి,మణికంఠ, వీరేష్ రోహిత్ చూడి మొదలగు కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## భాజపా రాష్ట్ర అధ్యక్షులను కలిసిన రామ్మోహన్

**పత్తికొండ జులై 2(మనం న్యూస్) :** భాజపా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ పోకల వంశీ నాగేంద్ర మాధవ్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా పీవీఎన్ మాధవ్ ను విజయవాడలో ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్లో బిజెపి కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ రామ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్.రామ్మోహన్ మాట్లాడుతూ బిజెపి పార్టీ



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అయనకు అవకాశం కల్పించిందన్నారు.అనంతరం పురందేశ్వరి,ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్యే పార్థసారథి లను కలిశారు.

## సి ఎం సహాయ నిధినుండి 3లక్షల 74వేల చెక్ అందజేత



**మహానంది, జులై 2(మనంన్యూస్) :** శ్రీశైల నియోజక వర్గం మహానంది మండల పరిధిలోని మహానంది గ్రామానికి చెందినక్రిష్ణ గౌడ్ కు బోర్డుబాండ్ బుడ్డా రాజశేఖర రెడ్డి బుధవారం 3 లక్షల 74 వేల రూపాయల చెక్ ను అందజేశారు. అనూజ అనే బాలిక అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స తీసుకుంది. అందుకు వైద్య ఖర్చులకు సి ఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్ ను బాలిక తండ్రి క్రిష్ణ గౌడ్ కు అందజేశారు. ఈకార్యక్రమంలో మహానంది గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు రామచంద్రుడు, శ్రీను, తదితరులు ఉన్నారు.

## మురికి కాలువని తలపిస్తున్న రోడ్డు

**మంత్రాలయం, జూలై 2 (మనం న్యూస్) :** మంత్రాలయం మండల పరిధిలోని చెట్నీహళ్లి గ్రామంలో రోడ్డు లేక మురికి కాలువలను తలపిస్తున్నాయి. కాలనీలో రోడ్డు నిర్మాణ పనులు పట్టించుకున్న నాయకులే కరువయ్యారని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని ఏళ్లుగా చెట్నీహళ్లి గ్రామంలో రోడ్డు లేక కాలనీ వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల ప్రచార సమయంలో వచ్చిన ప్రతి రాజకీయ నాయకులకు మాగోడు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. అయితే బుధవారం మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సుపరిపాలనలో మొదటి



మెట్టు కార్యక్రమానికి ఆయన చెట్నీహళ్లికి వచ్చారు. ఆ కాలనీలో పర్యటిస్తున్న టీడీపీ ఇన్ చార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి దృష్టికి కాలనీ వాసులు తీసుకెళ్లారు. రోడ్డును పరిశీలించిన ఆయన సంబంధిత అధికారులతో చర్చించి రోడ్డు వేయిస్తానని వారికి హామీ ఇచ్చారు.

## కౌతాళంలో బోరింగ్ (చేతిపంపు)లను చేయించిన సర్పంచ్ పాల్ దినకర్



**కౌతాళం జూలై 2 మనం న్యూస్ :** మండల కేంద్రమైన కౌతాళం నందు జిల్లా పరిషత్ హై స్కూల్ మరియు ఉరుకుంద క్రాస్ స్మశానం దగ్గర చెడి పోయిన రెండు చేతి పంపు ( బోరింగ్)లను ఎంపీపీ అంబ్రేష్,కోప్షన్ మెంబర్ మాబుసబ్ మరియు వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి,ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ సహకారంతో సర్పంచ్ పాల్ దినకర్ రెండు చేతి పంపులను పంచాయతీ కార్యదర్శి జి.ప్రకాశం మరియు హైస్కూల్ చైర్మన్ బసవ మరియు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సమక్షంలో చేతి-పంపులను రిపేర్ చేయించారని వారు తెలపడం జరిగింది.

## తోవిలో మొహరం పండుగకు 20వేల రూపాయలు విరాళం ఇచ్చిన వైసిపి నాయకులు

**కౌతాళం జూలై 2 మనం న్యూస్ :** కౌతాళం మండల పరిధిలోని తోవి గ్రామంలో మొహరం పండగ పురస్కరించుకొని గ్రామ మాజీ సర్పంచ్ నరసప్ప, ఉప సర్పంచ్ జయరాం మరియు పెద్ద ఈరన్న,ఎల్లప్ప గ్రామ పెద్దల సమక్షంలో 20వేల రూపాయలు విరాళం ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ మొహరం పండగ అందరూ కలిసి అన్నదమ్ములు మాదిరిగా ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకుందాం ఇది మన పండగ మనందరి పండగ అందుకని ప్రశాంతంగా జరుపుకుందామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసప్ప,ఉపసర్పంచ్ జైరాం, వైసీపీ



సీనియర్ నాయకులు పెద్ద ఈరన్న, లక్ష్మన్న, ఎల్లప్ప, ఈరన్న, ఖాదర్ బాషా, హనుమంతు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలి

మంత్రాలయం ఎస్ఐ శివాంజుల్



**మంత్రాలయం , జులై 2, మనం న్యూస్ :** విద్యార్థులు ఈవ్ టీజింగ్ కు దూరంగా ఉండాలని మంత్రాలయం ఎస్ఐ శివాంజుల్ అన్నారు. బుధవారం కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు మేరకు మంత్రాలయంలోని రాఘవేంద్ర డీగ్రి కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు , ఈవ్ టీజింగ్ , రోడ్డు ప్రమాదాలు పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ మోసాలు పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు.సైబర్ నేరాలు , వాటి వల్ల కలిగే నష్టాలు ,తీసుకోవల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ,విద్యార్థులు పాల్గొన్నారు.

## తెదేపా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటోంది

- మంత్రాలయం టీడీపీ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్రరెడ్డి

**మంత్రాలయం, జూలై 2 (మనం న్యూస్) :** ఎన్నికల వేళ తెదేపా ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుకుంటూ అభివృద్ధి లో ముందుకెళ్తోందని మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి అన్నారు. తెదేపా పార్టీ ఆదేశాలు మేరకు బుధవారం మండల పరిధిలోని చెట్నేహళ్ళి గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా గ్రామానికి చేరుకున్న ఆయన కు గ్రామ టీడీపీ నాయకులు చాపల నాగేష్ , మేకల మల్లేష్ , డీలర్ గోపాల్ , హనుమంతు లు స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్ళి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ , అభివృద్ధి పథకాలను ప్రజలకు , కరపత్రాలు అందించి ,అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ రెడ్డి చావిడి వెంకటేష్ ,అశోక్ రెడ్డి, వరదరాజులు,నాగేష్, మల్లేష్ మాలపల్లి లక్ష్మన్న, శివ, చిదానంద మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున



పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్ రెడ్డి ఆర్ లక్ష్మయ్య , చావిడి వెంకటేష్ , చంద్ర , వరదరాజులు, బంగారు నరసింహ , లక్ష్మన్న, రాఘవేంద్ర , శివ, చిదానంద , తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## టియుసిఐ నుంచి ఐఎఫ్‌టీయూ లోకి చేరిక

### ఐ ఎఫ్ టీ యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్,వెంకప్ప

**కర్నూలు జులై 02మనం న్యూస్ :** టియుసిఐ కార్మిక సంఘం నుండి ఐ ఎఫ్ టీ యూ లోకి చేరిక అయ్యారని భారత కార్మిక సంఘాల సమైక్య (ఐ ఎఫ్ టీ యూ) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రసాద్, వెంకప్ప తెలిపారు. కర్నూల్ నగరంలో అంబేద్కర్ భవన్ నందు ఐ ఎఫ్ టీ యూ నగర అధ్యక్షుడు సురేష్ నాయక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది.




ఈ సందర్భంగా టియుసిఐ కార్మిక సంఘం నుండి తిరుపాల్ మరియు 20 మంది నాయకులు మాతృ సంస్థ అయిన ఐ ఎఫ్ టీ యూ లోకి జాయిన్ కావడం జరిగింది. అనంతరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఉద్యమించడానికి కార్మికుల సిద్ధంగా ఉండాలని అన్నారు.

కార్మిక హక్కుల కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకిస్తూ ఈనెల 9వ తేదీన జరుగు దేశ వ్యాప్తంగా జరుగు సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులకు దోపిడీకి గురి చేసే జీవో నెంబర్ 21 నే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మనోహర్, రవి, బాబు, విజయ్ మొదలైన వారు పాల్గొన్నారు.

## సమస్యలు నా దృష్టికి వస్తే పరిష్కరిస్తా

దేవనకొండ ఎంపీడీవో జ్యోతి



**దేవనకొండ, జులై 2 (మనంప్రతినిధి) :** మండలంలో నెలకొన్న సమస్యలను నా దృష్టికి తీసుకు వస్తే పరిష్కరిస్తానని ఎంపీడీవో జ్యోతి పేర్కొన్నారు.బుధవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, మాజీ సింగల్ విండో చైర్మన్,మల్లయ్య, పి కోటకొండ రంగడు, టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా ఎంపీడీవో కు పూలమాలలు వేసి సన్మానించారు.అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ.... గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.

## నిరాశపరిచిన రాహుల్..

ఎడ్జ్ బాస్టన్ వేదికగా భారత్, ఇంగ్లండ్ మధ్య రెండో టెస్ట్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ లో ఇంగ్లండ్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకుంది. ఈ మ్యాచ్ కోసం భారత్ మూడు మార్పులు చేయగా.. ఇంగ్లండ్ తొలి టెస్ట్ లో ఆడిన జట్టునే యధాతథంగా కొనసాగించింది. భారత్ తరపున బుమ్రా స్థానంలో ఆకాశ్ దీప్.. సాయి సుదర్శన్ స్థానంలో వాషింగ్టన్ సుందర్.. శార్దూల్ ఠాకూర్ స్థానంలో నితీశ్ కుమార్ రెడ్డి తుది జట్టులో చోటు దక్కించుకున్నారు. తొలుత బ్యాటింగ్ చేస్తున్న భారత్ కు ఆదిలోనే భారీ షాక్ తగిలింది. ఇన్ ఫామ్ బ్యాటర్ కేఎల్ రాహుల్ 2 పరుగులకే ఔటై నిరాశపరిచాడు. క్రిస్ వోక్స్ బౌలింగ్ లో రాహుల్ క్లీన్ బౌల్ అయ్యాడు. తొలి టెస్ట్ తొలి ఇన్నింగ్స్ లో 42, రెండో ఇన్నింగ్స్ లో సెంచరీ (137) చేసిన రాహుల్ స్వల్ప స్కోర్ కే ఔట్ కావడం టీమిండియా అభిమానులకు తీవ్రంగా నిరాశపరిచింది. విదేశాల్లో ఘనమైన ట్రాక్ రికార్డు కలిగిన రాహుల్ కు ఎడ్జ్ బాస్టన్ అచ్చిరాలేదు. గతంలోనూ అతను ఇక్కడ ఆడిన రెండు ఇన్నింగ్స్ ల్లో ఘోరంగా విఫలమయ్యాడు (13, 4).



## సౌతాఫ్రికాకు మరో కొత్త కెప్టెన్



వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ సౌతాఫ్రికాకు రోజుల వ్యవధిలో ముగ్గురు కెప్టెన్లు మారారు. గత నెలలో జరిగిన డబ్ల్యూటీసీ 2023-25 ఫైనల్లో సౌతాఫ్రికాకు సారథ్యం వహించిన టెంబా బవుమా.. జింబాబ్వే పర్యటనకు విశ్రాంతి తీసుకోగా, కేశవ్ మహారాజ్ ను తాత్కాలిక సారథిగా నియమించారు.

జింబాబ్వే పర్యటనలో తొలి టెస్ట్ లో అదరగొట్టిన కేశవ్ మహారాజ్ దురదృష్టవశాత్తు గాయపడటంతో, రెండో టెస్ట్ లో అతనికి ప్రత్యామ్నాయంగా మరో కొత్త కెప్టెన్ ను నియమించారు. కెరీర్ లో కేవలం 20 టెస్ట్ మ్యాచ్ లే ఆడిన వియాన్ ముల్డర్ ను దక్షిణాఫ్రికా నూతన సారథిగా ఎంపిక చేశారు.

జింబాబ్వేలో పర్యటిస్తున్న సౌతాఫ్రికా జట్టులో కేశవ్ మహారాజ్ తర్వాత ముల్డరే అత్యంత అనుభవజ్ఞుడు (కైల్ వెర్రిన్ (26) మినహా). మిగతా ఆటగాళ్లంతా 20కి మించి టెస్ట్ లు ఆడలేదు. తొలి టెస్ట్ తో ప్రిటోరియస్, బ్రెవిస్, కోడి యూసఫ్ అరంగేట్రం చేశారు.

డబ్ల్యూటీసీ ఫైనల్ అనంతరం సీనియర్ ఆటగాళ్లంతా విశ్రాంతి తీసుకోవడంతో సౌతాఫ్రికా మేనేజ్ మెంట్ జింబాబ్వే టూర్ కు యువ జట్టును పంపింది. ఈ యువ జట్టుకు అత్యంత సీనియర్ అయిన కేశవ్ మహారాజ్ ను కెప్టెన్ గా నియమించింది.

అయితే అతను తొలి టెస్ట్ సందర్భంగా గజ్జల్లో గాయానికి గురయ్యాడు. రెండో టెస్ట్ లో అతనికి ప్రత్నామ్నాయ ఆటగాడిగా సెనురన్ ముత్తుస్వామిని ఎంపిక చేశారు. జులై 6 నుంచి బులవాయోలో జరిగే రెండో టెస్ట్ లో వియాన్ ముల్డర్ దక్షిణాఫ్రికా సారథిగా వ్యవహరిస్తాడు. దీంతో సౌతాఫ్రికా మూడు వరుస టెస్ట్ మ్యాచ్ ల్లో ముగ్గురు వేర్వేరు కెప్టెన్లతో బరిలోకి దిగినట్లవుతుంది.

కొత్త కెప్టెన్ ముల్డర్ జింబాబ్వేతో జరిగిన తొలి టెస్ట్ లో అద్భుతంగా రాణించాడు. పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ అయిన అతను తొలి ఇన్నింగ్స్ లో 4 వికెట్లు తీసి, ఆతర్వాత బ్యాటింగ్ లో సెంచరీ (147) చేశాడు. తొలి టెస్ట్ లో సారధిగా వ్యవహరించిన కేశవ్ మహారాజ్ కూడా ఆల్ రౌండర్ గా రాణించాడు. బ్యాటింగ్ లో 21, 51 పరుగులు చేసి బౌలింగ్లో 3,1 వికెట్లు తీశాడు. గాయంతో బాధపడుతున్న కేశవ్ మహారాజ్ ను స్వదేశానికి పిలిపించిన సౌతాఫ్రికా యాజమాన్యం అతనితో పాటు సీనియర్ పేసర్ లుంగి ఎంగిడిని కూడా జట్టు నుంచి రిలీజ్ చేసింది. తొలి టెస్ట్ లో అద్భుతంగా రాణించిన యువ పేసర్లకు మరో అవకాశం ఇవ్వడం కోసం ఎంగిడిని స్వదేశానికి పిలిపించారు. తొలి టెస్ట్ లో పేసర్లు కోడి యూసఫ్, మఫాకా, బాష్, ముల్డర్ విశేషంగా రాణించారు. ఆ మ్యాచ్ లో కేశవ్ మహారాజ్ ఏకైక స్పిన్నర్ గా బరిలోకి దిగాడు. కాగా, జింబాబ్వేతో తాజాగా ముగిసిన టెస్ట్ మ్యాచ్ లో సౌతాఫ్రికా 328 పరుగుల భారీ తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్ లో కార్బిన్ బాష్ (100, 5/43), డ్రి ప్రిటోరియస్ (153), వియాన్ ముల్డర్ (4/50, 147), కేశవ్ మహారాజ్ (3/70, 51), కోడి యూసఫ్ (3/42, 3/22) అద్భుత ప్రదర్శనలు చేసి సౌతాఫ్రికాను గెలిపించారు. ఈ గెలుపుతో సౌతాఫ్రికా చివరి 9 మ్యాచ్ ల్లో గెలిచిన జట్టుగా అరుదైన ఘనత సాధించింది. ప్రస్తుతం టెస్ట్ క్రికెట్ లో ఏ జట్టు ఈ ఘనత సాధించలేదు.



## లవ్లీనాకు స్వర్ణం.. నిఖత్‌కు రజతం



జాతీయ ఎలైట్ మహిళల బాక్సింగ్ టోర్నీలో తెలంగాణ స్టార్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ రజత పతకంతో సరిపెట్టుకుంది. మంగళవారం సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన మహిళల 51 కేజీల ఫైనల్లో జ్యోతి (ఆర్ఎస్పీబీ) చేతిలో నిఖత్ ఓడింది. ఒలింపిక్ పతక విజేత లవ్లీనా (టాప్స్) స్వర్ణంతో అదరగొట్టింది. 75 కేజీల ఫైనల్లో లాషు యాదవ్ (ఆర్ఎస్పీబీ)పై లవ్లీనా విజయం సాధించింది. 60 కేజీల విభాగంలో తెలంగాణ అమ్మాయి నిహారిక గోనెళ్ల కాంస్య పతకం గెలుచుకుంది. నాలుగు రోజుల పాటు అభిమానుల్ని అలరించిన బాక్సింగ్ టోర్నీ మంగళవారం ముగిసింది. రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు (ఆర్ఎస్పీబీ) జట్టు ఓవరాల్ టీమ్ టైటిల్ కైవసం చేసుకుంది. 48 కేజీలలో నీతూ (హరియాణా), చంచల్ (సాయ్ ఎన్).. 54 కేజీలలో ప్రీతి (టాప్స్), ధాను (ఎస్ఎస్పీబీ).. 57 కేజీలో బబిరోజ్సనా చాను (ఆర్ఎస్పీబీ), కమల్ జీత్ కౌర్ గిల్ (ఏఐపీ).. 60 కేజీలో ప్రాచి (ఆర్ఎస్పీబీ), అంజలి (హరియాణా)..65 కేజీలలో అంకుషిత బోరో (టాప్స్), శశి (ఆర్ఎస్పీబీ).. 70 కేజీలో శివాని (దిల్లీ), గితిమొని గొగోయ్ (సాయ్ ఎన్).. 80 కేజీలలో స్వీటీ (సాయ్ ఎన్), అల్ఫియా (ఆర్ఎస్పీబీ).. 80+ కేజీలలో రితిక (సాయ్ ఎన్), శివాని తోమర్ (ఏఐపీ) వరుసగా స్వర్ణ, రజత పతకాలు సాధించారు.

టాలీవుడ్ హీరో మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. కన్నప్ప జీవిత చరిత్ర ఆధారంగా రూపొందిన ఆ సినిమాకు ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహించారు. మోహన్ బాబు భారీ బడ్జెట్ తో నిర్మించగా.. కోలీవుడ్ అమ్మాయి ప్రీతి ముకుందన్ ఫిమేల్ లీడ్ రోల్ లో యాక్ట్ చేసింది.

ఈ సినిమాలో తన గ్లామర్ తో ఆకట్టుకుంది అమ్మడు. తాను పోషించిన రోల్ లో ధైర్యంగా కనిపించిన ప్రీతి.. పాత్రకు న్యాయం చేసిందనే చెప్పాలి. అలా హైలెట్ గా నిలిచి యూత్ ను తన అందచందాలతో బాగా అట్రాక్ట్ చేసింది అమ్మడు. అదే సమయంలో పలువురు టాలీవుడ్ మేకర్స్ దృష్టిలో కూడా ఆమె పడింది. ఇప్పుడు

## గ్లామర్ రోల్స్ కావాలంటున్న కన్నప్ప బ్యూటీ..

కొందరు మేకర్స్.. ఆమెను తమ సినిమాల్లోకి తీసుకోవాలని చూస్తున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే తన అప్ కమింగ్ సినిమాల్లో గ్లామరస్ రోల్స్ చేయాలని ప్రీతి ముకుందన్ భావిస్తున్నట్లు సమాచారం. అందుకు అనుగుణంగా స్క్రిప్ట్ లను సెలెక్ట్ చేసుకుంటుందని టాలీవుడ్ సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. కాగా, కోలీవుడ్ కు చెందిన ప్రీతి.. టాలీవుడ్ మూవీతోనే తెరంగేట్రం చేసింది. ఆ సినిమా కన్నప్ప కాదు.. యంగ్ హీరో శ్రీవిష్ణు లీడ్ రోల్ లో నటించిన శ్రీ విష్ణు కామెడీ సినిమాతో ఓం భీమ్ బుష్ తో డెబ్యూ ఇచ్చింది. ఆ సినిమాతో అనుకున్నంత పేరు రాలేదు. ఆ తర్వాత కోలీవుడ్ లో స్టార్ అనే మూవీతో అరంగేట్రం చేసింది. ఇప్పుడు కన్నప్పతో సందడి చేయగా.. ప్రస్తుతం ఆమె లైనప్ లో రెండు సినిమాలు ఉన్నాయి. మలయాళంలో మైనే ప్యార్ కియా, తమిళంలో ఇదయం మురళి సినిమాల్లో యాక్ట్ చేస్తోంది. ప్రస్తుతం ఆ చిత్రాల షూటింగ్స్ శరవేగంగా జరుగుతున్నది.



ఆమిర్ ఖాన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్'. భారీ ప్రాజెక్ట్ గా రూపొందిన ఈ సినిమా 2018లో విడుదలై పరాజయాన్ని అందుకుంది. ఇప్పుడీ చిత్రాన్ని ఉద్దేశించి ఆమిర్ ఖాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సినిమా చేదు ఫలితాన్నే ఇస్తుందని తనకు ముందే తెలుసన్నారు. చిత్రీకరణ సమయంలోనే రిజల్ట్ పై తనకొక క్లారిటీ వచ్చిందన్నారు. నటి ఫాతిమా సనాషేక్ తో స్క్రీన్ షేర్ చేసుకోవడంపైనా మాట్లాడారు. ఆమెకు ప్రియుడిగా నటించడం తనకి ఏమీ ఇబ్బందిగా

## ఫాతిమాతో ఆన్ స్క్రీన్ రొమాన్స్.. అభ్యంతరం లేదన్న అమీర్ ఖాన్



అనిపించలేదన్నారు. ''ఈ సినిమాలో హీరో పాత్రకు ప్రియురాలిగా ఏ హీరోయిన్ నటిస్తే బాగుంటుందా? అని మేము ఎంతో చర్చించుకున్నాం. దీపికా పదుకొణె, శ్రద్ధాకపూర్, అలియాభట్ వంటి తారలను సంప్రదించాం. కానీ వారెవరూ అంగీకరించలేదు. స్క్రిప్ట్ నచ్చకపోవడంతో వారంతా తిరస్కరించి ఉండొచ్చు. చివరకు ఫాతిమా సనాషేక్ను ఆ రోల్ కోసం ఎంపిక చేశాం. నటించేందుకు ఆమె అంగీకరించింది. గతంలో మేమిద్దరం 'దంగల్' కోసం పనిచేసిన విషయం తెలిసిందే. అందులో తండ్రీకుమార్తెలుగా నటించాం. ఆ చిత్రాన్ని దృష్టిలో ఉంచుకుని.. ''మీ పాత్రల మధ్య ఎలాంటి రొమాంటిక్ సన్నివేశాలను చిత్రీకరించాలనుకోవడం లేదు. ఎందుకంటే గతంలో మీరిద్దరూ తండ్రీకుమార్తెలుగా నటించారు. ఇప్పుడు ప్రేమికులుగా రొమాన్స్ చేస్తే ప్రేక్షకులు ఏమాత్రం అంగీకరించరు'' అని దర్శకుడు చెప్పారు. ఆ మాటలను నేను ఖండించాను. ప్రేక్షకులు ఏమీ తెలివి తక్కువ వాళ్లు కాదన్నాను. నిజ జీవితంలో మేమిద్దరం తండ్రీకుమార్తెలం కాదని వారికి తెలుసు. కాబట్టి వాళ్లు ఏమీ తప్పుగా అనుకోరని బదులిచ్చా'' అని ఆమిర్ ఖాన్ తెలిపారు.

తాము మొదట అనుకున్న విధంగా సినిమా తెరకెక్కించలేకపోయామన్నారు. సమయానుగుణంగా స్క్రిప్ట్ను మార్చాల్సి వచ్చిందన్నారు. సినిమా పరాజయానికి అదీ ఒక కారణమని తెలిపారు. చిత్రీకరణ సమయంలోనే సినిమా ఎలా ఆడుతుందనే దానిపై తనకొక క్లారిటీ వచ్చిందన్నారు. పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ గా ఇది రూపొందింది. విజయ్ కృష్ణ ఆచార్య దర్శకుడు. అమితాబ్ బచ్చన్, కత్రినా కైఫ్ కీలక పాత్రలు పోషించారు.

## 'అఖండ-2'లో బజరంగీ భాయిజాన్ ఫేమ్ హర్షాలి




గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'అఖండ 2 - తాండవం' కోసం ప్రేక్షకులు ఏ రేంజ్ లో ఎదురుచూస్తున్నారో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు బోయపాటి శ్రీను తనదైన మార్క్ టేకింగ్ తో తెరకెక్కిస్తున్నాడు. ఇక ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ దగ్గర బోయపాటి-బాలయ్య కాంబినేషన్ సెన్సేషన్ క్రియేట్ చేయడం ఖాయమని చిత్ర వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

అయితే, ఈ సినిమాలో బాలయ్య రెండు వైవిధ్యమైన పాత్రల్లో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఆయనతో పాటు ఈ సినిమాలో పలువురు నటీనటులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కాగా, ఈ సినిమాలో తాజాగా బాలీవుడ్ చిత్రం 'బజరంగీ భాయిజాన్'లో మున్నీ పాత్రలో నటించిన హర్షాలి మల్హోత్రా కూడా నటిస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు. జనని అనే పాత్రలో హర్షాలి కనిపించబోతున్నట్లు మేకర్స్ తాజాగా ఓ కొత్త పోస్టర్ ద్వారా వెల్లడించారు.

దీంతో ఈ సినిమాలో ఆమెది ఎలాంటి పాత్ర అయి ఉంటుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాలో సంయుక్త మీనన్ హీరోయిన్ గా నటిస్తుండగా థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై రామ్ ఆచంట, గోపి ఆచంట ప్రొడ్యూస్ చేస్తున్నారు. దసరా కానుకగా ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 25న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

## 'హరి హర వీరమల్లు' ట్రైలర్ టైమ్ ఫిక్స్.. దర్శకుడిని అభినందించిన పవన్

పవన్ కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న పీరియాడిక్ యాక్షన్ అడ్వెంచర్ మూవీ 'హరిహర వీరమల్లు'. క్రిష్, జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఇది సిద్ధమవుతోంది. ఈ సినిమా అప్డేట్స్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా దీని ట్రైలర్ విడుదల వివరాలను టీమ్ పంచుకుంది. జులై 3 ఉదయం 11.10 గంటలకు ఇది విడుదల కానున్నట్లు తెలిపింది. పవన్ కల్యాణ్ ఈ ట్రైలర్ చూసి ఎంజాయ్ చేస్తోన్న వీడియోను పంచుకుంది. ఆ వీడియో చివర్లో పవన్ దర్శకుడిని అభినందించారు. 'చాలా కష్టపడ్డావ్..' అంటూ ఆత్మీయంగా హత్తుకున్నారు. ''తుపాను వెనక ఉండే శక్తి.. ట్రైలర్ చూశాక పవన్ కూడా తన ఉత్సాహాన్ని అదుపు చేయలేకపోయారు'' అని నిర్మాణ సంస్థ తెలిపింది. ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ తో కలిసి పవన్ ఈ ట్రైలర్ ను వీక్షించారు. ఈ సినిమాని క్రిష్ కొంతభాగం తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత ప్రొడ్యూసర్ రత్నం తనయుడు జ్యోతికృష్ణ దర్శకత్వ బాధ్యతలు తీసుకున్నారు. పవన్ ఇందులో చారిత్రక యోధుడిగా మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్. బాబీ దేవోల్, అనుపమ్ ఖేర్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. తొలిభాగం 'హరి హర వీరమల్లు: పార్ట్ 1- స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్' పేరుతో విడుదల కానుంది.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises D.No:3-88, Gosala village, Penamaluru Mandal, Krishna District 521151(AP), And Published at H.No.23-3-46, 1st Floor, Katamaraju vari Veedhi, Amaravathi Road, Naidupet Guntur(District) AP-522002. EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.APTEL/2016/73939.